
మల్లంపేట్ 'జిఎల్‌సి' రోడ్ నెం.10 లో అక్రమ విల్లాల నిర్మాణం.. మొత్తం పిల్లర్లు నిలబెట్టిన దృశ్యం..

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్




# బాధ్యతలేని అధికారులు..!
# బరితెగించి కబ్జాలు-నిర్మాణాలు..!

- ఉత్సవ విగ్రహాలుగా..!'తహశీల్దార్-డిప్యూటీ కమిషనర్'లు..?
- దుండిగల్‌లో రూ.100 కోట్లు విలువైన భూమిలో అధికారమే అండగా కబ్జాలు..?
- 'జిఎల్‌సి' రోడ్ నెం.1లో ఏడాది క్రితం అసైన్డ్ భూమిలో కబ్జా యత్నం విఫలం..!
- మల్లంపేట్ 'జిఎల్‌సి'రోడ్డ్ నెం.10లో తాజాగా అసైన్డ్ భూమిలో ఈ అక్రమ నిర్మాణాలు..?
- "మై క్యూర్ సిటిజెన్ యాప్"లో పలుమార్లు స్థానికుల ఫిర్యాదులు..
- మూడుసార్లు సమాధానానికే పరిమితమైన 'టౌన్‌ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్ చర్యలు..?
- ప్రశ్నించినా, పత్రికల్లో వార్తలు వచ్చినా విలేకరుల ఫోన్లు బ్లాక్ చేస్తున్న అధికారులు..!
- దుండిగల్ టౌన్‌ప్లానింగ్ ఏసిపి దారిలోనే.. నూతన టిపిఎస్ ముఖేష్ సింగ్..!
- బాధ్యతగల విధుల్లో, అక్రమ నిర్మాణాల నియంత్రణ అధికారుల నిర్వాకం..
- 'జిఎల్‌సి' వెంచర్‌లో అదనంగా ఆక్రమించిన అసైన్డ్ భూమిపై తహశీల్దార్ మౌనం..?
- పనికిమాలినోళ్ళ సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తూ..! ప్రభుత్వ బాధ్యతలకే తలవంపు..?

## బెల్లం కొట్టిన రాయిలా పడున్న.. దుండిగల్ "రెవెన్యూ-మున్సిపల్" యంత్రాంగం..

తెలంగాణ స్వ రాష్ట్ర సాధన, ఎందరో ప్రాణత్యాగాలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన విషయం యెలియనిది కాదు..! కానీ కొందరు అవివేకంతో చేసే ప్రసంగాలు, అనాలోచిత వ్యాఖ్యలు, హాస్యాస్పదంగా ఉన్నాయి.. త్యాగఘనుల ఆత్మ క్షోభించే విధంగా ఉన్నాయి.. అదేదో ఓ నలుగురు నాయకులు ఆమరణ దీక్షలు చేస్తేనో..! నలుగురు గల్లీ నాయలే చేసిన వంట వార్పులతో' తెలంగాణ వచ్చిందనే డబ్బాకొట్టుకునే బ్యాచ్‌ల గురించి తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారు.. ప్రస్తుతం ఈ విషయం అప్రస్తుతమే అయినప్పటికీ..! సిఫార్సులు చేసే నేతల ఆగడాలు- అదే శాసనంగా భావించే, కరెప్షన్ అధికారులు, ఈ సాకుతో ప్రమాదకర అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..! అవే సిఫార్సుల నెపంతో ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారంలో రెవెన్యూ యంత్రాంగం తక్కువేమి కాదు.. ఒకటి మాత్రం నిజం..! తెలంగాణలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా స్పష్టతను ఇస్తున్న అంశాలు బాధాకరంగా ఉన్నాయి.. "నేతలు- అధికారుల" కోసమే ఈ రాష్ట్రం ఏర్పాటు చేశారన్నట్టు, నిరూపిస్తున్న ఘటనల్లో..? ఒకటి దుండిగల్ సర్కిల్-59 అండ్, దుండిగల్ మండలం రెవెన్యూ యంత్రాంగం పనితీరు, ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 19:

-4లో


మల్లంపేట్ 'జిఎల్‌సి'లో అక్రమ విల్లాలు చేపడుతున్న దృశ్యం..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రిసెప్షన్‌కు సీఎం రేవంత్..
# నూతన దంపతులకు ఆశీస్సులు

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వివాహ రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- నూతన దంపతులు వెంకట్, ఇందుజలను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి
- ఇటీవల గోవాలో వెంకట్ వివాహం జరిగిన సంగతి తెలిసిందే
- పార్టీ నాయకులు, శ్రేయోభిలాషుల కోసం ఈ విందు ఏర్పాటు

-4 లో



# కేంద్రం ప్రకటనలకే పరిమితం



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి ఈ సీజన్‌లో కేంద్రం ముందుకు రావాలని, శనగ, పొద్దుతిరుగుడు పంటలపై ఉన్న 25శాతం పరిమితిని ఎత్తివేసి, పూర్తిగా కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ పంటలకు మద్దతు ధర ప్రకటించడం, ప్రతి సంవత్సరం పెంచడం వరకే కేంద్రం పరిమితమైందని, వాస్తవ కొనుగోళ్ల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. మద్దతు ధరకు మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు కూడా పంటల కొనుగోళ్లకు రాష్ట్రాలకు మద్దతు ఇవ్వకపోవడం ఏ రకంగా రైతులు అర్థం

-6 లో

# బాధ్యతలేని అధికారులు..! బరితెగించి కబ్జాలు-నిర్మాణాలు..!


కొత్తగా మరికొన్ని విల్లాలకు పుట్టింగ్‌ల పనులు.. ఆదివారం(నిన్నటి) నాటి ఫొటో..


'జిఎల్‌సి'లో ఆక్రమిత అసైన్డ్ భూమిలో అక్రమ విల్లాల నిర్మాణ పనుల తాజా ఫొటోలు..

**మల్లంపేట్ 'లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్'లోని 'జిఎల్‌సి'లో అక్రమ విల్లాలుగా 2021లోనే, "అనుమతులు 60- అక్రమంగా 260 విల్లాలు నిర్మించారని, మేడ్చల్ జిల్లా కలెక్టర్ విచారణలో నిర్ధారించారు.. బిల్డర్‌పై కేసులు నమోదు చేశారు.. ఆ తర్వాత 2022 అక్టోబర్ 3వ తేదీ వరకు, నిర్మాణ దశలో ఉన్న "208 విల్లాలకు" మౌలిక వసతులు కల్పించకుండా "నిషేధిత" జాబితాలో ఉంచుతూ దుండిగల్ కమిషనర్ 2022 అక్టోబర్ 3న పలు శాఖలకు నోటీసులు జారీచేశారు.. విద్యుత్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి త్రాగునీటికి, రిజిస్ట్రేషన్‌ల నియంత్రణకు, నోటీసులు జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్‌కు కూడా లేఖను విడుదల చేశారు..**

## బిల్డర్‌కో ఆంక్షలు..! 'జిఎల్‌సి' వాసులకో ఆంక్షలా..?

దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధి మల్లంపేట్ 'జిఎల్‌సి' కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. అధికారుల ఆంక్షలు బిల్డర్ విజయలక్ష్మికి ఒక న్యాయం, 'జిఎల్‌సి' వాసులకు మరొక న్యాయమా అంటూ ప్రశ్నిస్తున్నారు.. అక్రమ నిర్మాణాలుగా విల్లాలకు మౌళికవసతులు కల్పించకుండా, నిషేధిత జాబితాలో పెట్టారని, దాని ప్రభావం కేవలం విల్లావాసులపైనే పడుతుందని, బిల్డర్‌కు మాత్రం అన్ని వసతులు కల్పిస్తున్నారని 'జిఎల్‌సి'లో నివాసం ఉండే, ఓ ముఖ్య వ్యక్తి 'పెన్ పవర్' ప్రతినిధితో సంచలన ఆరోపణలు చేశారు.. బిల్డర్‌కు సంబంధించిన విల్లాలకు విద్యుత్ మీటర్లు ఇస్తున్నారు, విల్లాలు క్రమబద్ధీకరణ చేస్తున్నారు.. తమకు మాత్రం విద్యుత్ మీటర్లు నిరాకరిస్తున్నారని, క్రమబద్ధీకరణపై అధికారులను ప్రశ్నిస్తే, ప్రభుత్వ భూమి అంటూ నిరాకరిస్తున్నారని సదరు వ్యక్తి ఆవేదన చెందారు.. తమకు ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న అధికారులు, ప్రస్తుతం రోడ్ నెంబర్ 10 లో విల్లాలకు అనుమతులు ఎలా ఇచ్చారని 'జిఎల్‌సి'లో ప్రముఖ వ్యక్తి ప్రశ్నిస్తున్నారు.. అధికారుల ఆంక్షలు బిల్డర్‌కు సానుకూలంగానూ..! 'జిఎల్‌సి' వాసులకి వ్యతిరేకంగానూ ఉండటం ఏమిటని ఆయన తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు.. త్వరలో ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, తమకు న్యాయం చేయమని కోరాడు..

-3 పేజి తరువాయి


మేడ్చల్ జిల్లా దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, మల్లంపేట్‌లో ఓవైపు భూమాఫియా, మరోవైపు అందులోనే అక్రమ నిర్మాణాల దందా, యధేచ్ఛగా కొనసాగుతోంది.. స్థానికులు ఫిర్యాదులు చేసినా, సంబంధిత అధికార యంత్రాంగం పరోక్షంగా, అక్రమార్కులకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.. ఈ వ్యవహారంలో ఏ పదవులు లేని ఓ అధికారపార్టీ నాయకుని నియంతృత్వ విధానలు, అహంకార పూరిత సిఫార్సులు, అధికారులపై ఒత్తిడితో రూ.100 కోట్లు విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమ విల్లాల నిర్మాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. స్థానికులు ఫిర్యాదు చేసినా పత్రికల్లో వార్తలు వచ్చినా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, వారి పనితీరును ఎండగడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. దోచుకున్న దాంట్లోనే కొంత ఖర్చుచేస్తే చాలు, రూ. కోట్లు విలువచేసే ఆస్తులు తమ సొంతమై పోతాయనే ధోరణిలో కబ్జాదారులు ఉండగా.. ఈ వ్యవహారంలో అధికార యంత్రాంగం పరంగా, ఎవరి లాభాపేక్ష వారిది అంటూ విమర్శలు వస్తున్నాయి.. సిఫార్సులు అమలు చేయడంలో ఒక విభాగం సామాజిక వర్గపరంగా సహకరిస్తుంటే..! మరొక విభాగం ముడుపులే లక్ష్యంగా చర్యలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోందని, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..


## ఖాళీస్థలాలు గజం రూ.10 వేలట..?


మల్లంపేట్ సర్వే నెం.170/3, 170/4, 170/5 లో మొత్తం సుమారు 15 ఎకరాలు కొనుగోలు చేసిన 'జిఎల్‌సి' బిల్డర్, అదనంగా ఆక్రమించిన ప్రభుత్వ అసైన్డ్ భూమిలో, ఇప్పటికే పలు విల్లాలు నిర్మించినట్లు స్థానికులే స్పష్టతను ఇస్తుండగా..! తజాగా మరికొన్ని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.. అక్కడక్కడా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో త్రికోణం ఆకారంలో ఉన్న స్థలాలు, స్థానికంగా ఓ వ్యక్తికి గజం రూ.10 వేల చొప్పున విక్రయించి రిజిస్ట్రేషన్‌లు కూడా చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు..


## 'మై క్యూర్ సిటిజెన్' యాప్‌లో పలుమార్లు ఫిర్యాదు..

**దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని మల్లంపేట్ 'జిఎల్‌సి' వెంచర్‌లోని ఆక్రమిత అసైన్డ్ భూమిలో అక్రమ విల్లాల నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారం ప్రధానంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. 2026 ఏప్రిల్ 8 నుండి-ఏప్రిల్ 18 వరకు దాదాపు 4 సార్లు "మై క్యూర్ సిటిజెన్ యాప్‌లో" ఫిర్యాదు చేసినప్పటికీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ఏసిపి శ్రీనివాస్, నోటీసులు జారీ-చేశామని, మూడుసార్లు కూడా, సమాధానంతోనే సరిపెడుతూ, చర్యలకు దూరంగా ఉంటున్నట్లు ఫిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు.. ఆదివారం 5వ సారి ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు.. మరోవైపు, టౌన్‌ప్లానింగ్ నోటీసులు కట్టుకోమని ఇస్తున్నారా..? పనులు నిలిపివేయమని ఇస్తున్నారో తెలియదు కానీ..! అక్రమ నిర్మాణ దారులు మాత్రం రెండవది పాటిస్తూ, పనులు యధావిధిగా కొనసాగించడం అనుమానాలను రేకెత్తిస్తోంది.**





## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రిసెప్షన్‌కు సీఎం రేవంత్.. నూతన దంపతులకు ఆశీస్సులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీ యువ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న గడ్డం ఇందుజ రెడ్డితో ఆయన వివాహం ఏప్రిల్ 11న గోవాలో జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోసం తాజాగా వివాహ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై, నూతన దంపతులు వెంకట్, ఇందుజలతో కాసేపు


ముచ్చటించారు. వారి భవిష్యత్ జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. ఈ విందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు కూడా హాజరై వధూవరులను అభినందించారు.

# రాముని పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు ప్రకాష్ రాజ్ పై ఫిర్యాదు



**పెన్ పవర్,** భద్రాచలం పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కుంజా ధర్మారావు ఆధ్వర్యంలో సినీ నటుడు ప్రకాష్ రాజ్ పై ఆదివారం భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఇటీవల ఒక ప్రజా వేదికలో పవిత్ర హిందూ ఇతిహాసమైన రామాయణంకు సంబంధించిన వ్యాఖ్యలలో, శ్రీరాముడు ఉత్తర భారతీయుడని, రామ--లక్ష్మణ--సీతలు లంకలో పండ్లు దొంగతనం చేయడం వలన యుద్ధం జరిగిందని చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉండటమే కాకుండా, భద్రాచలం వంటి దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో సామాజిక సమైక్యతకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రకాష్ రాజు పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి,
అందుబాటులో ఉన్న వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు మరియు ఇతర ఆధారాలను పరిశీలించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ సందర్భంగా హిందూ సంప్రదాయాలు, విశ్వాసాలను కించపరిచే విధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, ముత్యాల శ్రీనివాస్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, ఆవుల సుబ్బారావు, బోడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రంగనాయక స్వామి దేవాలయంలో చోరీ..



**పెన్ పవర్,** హయత్‌నగర్: తొర్రూరు శివారులోని రంగనాయక స్వామి దేవాలయంలో చోరీ జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. తొర్రూర్--బ్రాహ్మణపల్లి రోడ్డులో ఉన్న ఈ దేవాలయంలో శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. అనంతరం దేవాలయంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులోని నగదును అపహరించి పరారయ్యారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన స్థానికులు చోరీ జరిగిన విషయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు దేవాలయాన్ని జియో ట్యాగ్ చేసి, అక్కడ ఈ-పాయింట్ బుక్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

# ప్రైవేట్ హాస్పిటళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి -- సిపిఐ డిమాండ్..

**పెన్ పవర్,** ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ప్రైవేట్ హాస్పిటళ్లు రోగులపై అధిక ఫీజులు, అవసరం లేని పరీక్షలు, చికిత్సల పేరుతో భారీగా దోపిడీ చేస్తున్నాయని సిపిఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు వైద్య సేవల కోసం ఆసుపత్రులకు వెళ్లినప్పుడు వేల రూపాయల బిల్లులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు, నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని వారు విమర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా రోగులను డబ్బు కోసం వేధించడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆసుపత్రిలో చికిత్సలకు సంబంధించిన రేట్ల జాబితాను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పేదలకు ఉచిత లేదా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందేలా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్, మున్సిపల్ కార్యదర్శి బండి నర్సింహా, జిల్లా నాయకులు పోచమోని నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ గుడి నిర్మాణమునకు విరాళామందించిన దాతలు



**పెన్ పవర్,** :శ్రీరంగాపూర్ మండల్ వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం రోజున పెద్దమ్మ గుడి నిర్మాణం కొరకు వెంకటాపూర్ గ్రామ కులస్తులు దైవ భక్తితో విరాళం అందించడం జరిగింది. గ్రామంలో అన్ని కులస్తులు తన వంతు ఆర్థిక సాయం అందించారు . కాబట్టి పెద్దమ్మ గుడి నిర్మాణం కొరకు
1) క్రీస్తు శేషులు కొండయ్య గారి బాలప్ప వారి కుమారులు కే వెంకటస్వామి కె ఆంజనేయులు 5558 రూపాయలు
2) క్రీస్తు శేషులు మెంటేపల్లి కిష్టన్న జ్ఞాపకార్థం వారి కుమారులు ఎం వెంకటస్వామి ఎం శంకర్ నాయుడు 5016 రూపాయలు
3) క్రీస్తుశేషులు కొండయ్య గారి శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటస్వామి ఆంజనేయులు 5116 రూపాయలు
4) క్రీస్తు శేషులు పాపయ్య గారి నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు జగతిభూషణ్ నాయుడు పి చంద్రుడు 5000 రూపాయలు
5) క్రీస్తు శేషులు కొండయ్య గారి బుచ్చన్న వారి కుమారుడు కొండాయ గారి రాఘవేందర్ 5000 వేల రూపాయలు
6) కీర్తిశేషులు కొండయ్య గారి నారమ్మ జ్ఞాపకార్థం వారి మనవరాలు సాయి ఈశ్వరి 5000 వేల రూపాయలు
7) క్రీస్తు శేషులు కొండయ్య గారి గాలెన్న జ్ఞాపకార్థం వారి మనవలు 5000 వేల రూపాయలు
గ్రామ పెద్దలకు దేవాలయ మేనేజ్మెంట్ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , గ్రామ సర్పంచ్ భారతి ఎల్లా గౌడు గ్రామ ఉపసర్పంచ్ సామెల్ మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ వరలక్ష్మి శ్రీనివాసులు మాజీ సర్పంచ్ కుమ్మరి బొడ్డుపల్లి నాగన్న మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుమ్మడం కృష్ణయ్య మాజీ సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు మాజీ ఉపసర్పంచ్ పి చంద్రుడు వార్డ్ మెంబర్ కుమ్మరి బాలరాజ్ ఈ అశోక్ గోవిందు చింతలయ్య ఆంజనేయులు ప్రవీణ్ కుమార్ మెంటపల్లి మన్నెమ్మ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటస్వామి మండల జర్నలిస్ట్ మెంటేపల్లి శంకర్ నాయుడు బుక్క ఆనంద్ కుమ్మరి జానకి రాముడు దశరథ నరసింహ సుగ్రీవుడు రాము గౌడ్ బక్కన్న పరుశురాం రాముడు ధర్మయ్య భగవంతు దేవేందర్ మహేందర్ నాగరాజు నాగన్న పెంటన్న ఎల్లయ్య గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం



- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్డబ్ల్యూఎఫ్ నిర్ణయం
- కార్మిక యూనియన్లు, ప్రజాసంఘాల మద్దతు కూడగడుతున్న టిఎస్ ఆర్టీసీ ఎస్డబ్ల్యూఎఫ్

**పెన్ పవర్,** :ఆర్టీసీ పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని, కార్మికులకు చైతన్యం కల్పించి, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం అవ్వాలని కొత్తగూడెం యుటిఎఫ్ భవన్లో ఆదివారం
రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు ప్రజాసంఘాల నాయకులు ఆర్టీసీ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మందా నరసింహ రావు, ఆర్టీసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రీజియన్ నాయకులు యాస నాగేశ్వరరావు, మాట్లాడుతూ ఆర్టీసీ ప్రైవేటు వ్యక్తుల చేతులకు వెళ్ళనీయకుండా ప్రభుత్వం ఆధీనంలో ఉండే విధంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ పరిరక్షణ కోసం ప్రతి కార్మికునీ యొక్క ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని సమ్మెకు సిద్ధం అయ్యేలా కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి నిర్ణయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క సాచివేత ధోరణి సరైంది కాదన్నారు. వేతన సవరణ చేయాలన్నారు . ఆర్టీసీలో నూతన ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని అన్నారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ప్రాధాన్యత గుర్తిస్తామని చెప్పిన విషయం కాంగ్రెస్ ప్రభుత్వం మరచిందన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయకుండా వారంతట వారే ఉద్యోగాన్ని వదిలి వెళ్లేలా ఆత్మహత్య సదృశ్యంల చిత్రీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని వారు అన్నారు. ఆర్టీసీ సంస్థలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్డబ్ల్యుఎఫ్ నాయకత్వంలో దశలవారి ఆందోళన పోరాటలను నిర్వహిస్తున్నమని తెలిపారు . ఈ క్రమంలోనే ప్రధాన పోరాటాలు కొనసాగిస్తున్న ఎస్ డబ్ల్యూ ఎఫ్ సంఘ నాయకత్వానికి తెలియజేయకుండా, సంప్రదింపులు చేయకుండా సమ్మె నోటీసులు ఇచ్చిన కొన్ని కార్మిక సంఘాల నాయకత్వం వైఖరి సరైనది కాదని అన్నారు . ఐక్య పోరాటాలకు వేదికగా ఎస్డబ్ల్యూఎఫ్ సిఐటియు నాయకత్వంలో గత అనేక సమ్మెల విజయవంతం అయ్యాయని సదరు కార్మిక సంఘాల కు గుర్తు చేశారు. సమ్మె చేయాలని పిలుపు ఇచ్చిన ఆర్టీసీ కార్మిక సంఘాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సమ్మె విజయవంతం కోసం ఎస్ డబ్ల్యూఎఫ్ సిఐటియు కూడా సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి ఎస్డబ్ల్యూ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. టియుసిఐ జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్ మాట్లాడుతూ ముందు ఆర్టీసీలో ఉన్న కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉండాలని అలా కలుపుకొని జేఏసీగా ఏర్పడాలని సూచించారు గత చరిత్రను పరిశీలించినప్పుడు కార్మిక సంఘాల ఐక్యంగా లేకుండా విజయాలు సాధించ లేదన్నారు. ఆర్టీసీ కార్మికులు చేసే పోరాటాలకు మా పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక సంఘాలను పిలిచి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని అన్నారు ఆర్టీసీ కార్మికులు చేసే సమ్మెకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు . ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలుష్య నివారణ పేరుతో ఆర్టీసీలోకి ఎలక్ట్రికల్ బస్సులను తీసుకురావడం ద్వారా ఆర్టీసీను ప్రైవేటు పరం చేసే పెద్ద కుట్ర జరుగుతుందని అన్నారు ఎలక్ట్రికల్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా విధానంలో మార్పు తేవాలని అన్నారు. ఆర్టీసీ కార్మికులు చేసే ఏ పోరాడానికైనా మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్,, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు నాగకృష్ణ తదితరులు పాల్గొని ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు కార్మికులకు అండగా ఉంటామని ఏ సమస్య వచ్చినా అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా సమ్మెకు ముందు నిలుస్తామని వారు పిలుపునిచ్చారు. సంపూర్ణ మద్దతు ప్రకటించారు . ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షులుగా ఎస్డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు బి.ఎన్.రావు వ్యవహరించరు.ఈ కార్యక్రమంలో బి ఎన్ కుమార్, ఐ.వెంకటేశ్వర్లు,పి లక్ష్మణరావు, రాంబాబు, నరేష్, సతీష్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం..




**పెన్ పవర్,** అక్షయ తృతీయ సందర్భంగా ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ కాలనీలో బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల భవిష్యత్తును కాపాడేందుకు బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీపీ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుందరయ్య నగర్, లక్ష్మీ నగర్ కాలనీలను బాల్యవివాహ రహిత, బాల కార్మిక రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరిత, పోలీస్ అధికారులు నరేష్, ఆర్‌పి జ్యోతి, మహిళా సంఘాల సభ్యులు, ఇరు కాలనీల పెద్దలు, కాలనీ అధ్యక్షుడు బోడియ నాయక్, కమిటీ సభ్యులు గొబ్బూరి కృష్ణారాజు, నాయుడు, రాకేష్ నాయక్, రాజు గౌడ్, రాణెమ్మ, ఆశ్రిత బృందానికి చెందిన పర్వతాలు, మాధవి, పద్మ, వీరబాబు, పవిత్ర, మమత తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి సహాయం అందించిన సూర్యోదయ కాలనీ వాసులు..

**13వేల నగదు, 25కిలోల బియ్యం అందజేత..**

**పెన్ పవర్,** ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామం సూర్యోదయ కాలనీ నిరుపేద కుటుంబానికి చెందిన నర్కుడు యాదమ్మ ఇటీవలే ఆకస్మికంగా మృతి చెందింది. నీరుపేద కుటుంబం కావడంతో ఇంట్లో పరిస్థితి అంతా బాగాలేదు, మృతురాలు నర్కుడు యాదమ్మ కుటుంబానికి సూర్యోదయ కాలనీకి చెందిన యువకులు తలకొన్ని రూపాయలు పోగుచేసి ఆదివారం 13వేల రూపాయలను, అలాగే బిఆర్ఎస్ నాయకులు మొలుగు సంజీవ తన వంతు సహాయంగా 25 కిలోల బియ్యన్ని మృతురాలు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మొలుగు సంజీవ, చిన్నెల్లి మహేష్, మొలుగు రవి, మొలుగు శ్రీనివాస్, కర్రే ఇబ్రహీం, కర్రే శంకర్, చిన్నెల్లి లింగస్వామి, కర్రే ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



# భీముడు.. హనుమంతుడు.. మోడీ.. రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** తన వాదనను బలంగా.. అందరికి ఇట్టే అర్థమయ్యేలా చెప్పే విషయంలో తెలుగు రాష్ట్రాల్లో తిరుగులేని టాలెంట్ ఉన్న ముఖ్యనేతలు పలువురు ఉన్నారు. వారిలో కేసీఆర్.. రేవంత్.. కేటీఆర్.. హరీశ్ రావులు కనిపిస్తారు. ఈ విషయంలో ఏపీకి చెందిన కీలకనేతల్లో ఆ టాలెంట్ తక్కువనే చెప్పాలి. తాజాగా రాజ్యాంగ 131వ సవరణ బిల్లు వీగిన నేపథ్యంలో.. ఢిల్లీలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిందే. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు వీగిపోవటం.. మహిళా బిల్లు పాస్ కాకుండా కాంగ్రెస్ అడ్డుకుందన్న ప్రచారం జోరుగా సాగుతున్న వేళ.. ఆ వాదనను ఖండిస్తూ.. రేవంత్ తనదైన శైలిలో సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు.

తమ మీద తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీపై విమర్శలు చేసే క్రమంలో ప్రధాని మోడీని ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ చెప్పిన పిట్టకథ కాస్త ఆసక్తికరంగా మారింది. తనకు తిరుగు లేదన్నట్లుగా వ్యవహరించే మోడీ అహంకారానికి తాజాగా దెబ్బ పడిందన్న అర్థం వచ్చేలా మాట్లాడటం వరకు ఓకే.ఈ సందర్భంగా మహాభారతంలోని ఒక ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. మోడీ అహంకారం ఎంతలా ఉంటుందో చెబుతూనే.. అదే సమయంలో దానికి దెబ్బ పడిందన్న అర్థాన్ని చెప్పిన వైనం ఆసక్తికరంగా మారింది. ఇంతకూ సీఎం రేవంత్ ఏం అన్నారన్నది ఆయన మాటల్లోనే చూస్తే..“మహాభారతంలో భీమసేనుడు కూడా గొప్ప యోధున్ని అన్న అహంకారంతో



విర్రవీగితే ఓ వృద్ధుడి రూపంలో వచ్చిన హనుమంతుడు బుద్ధి చెప్పి.. అహంకారాన్ని తొలగించారు. ప్రధాని మోదీ అహంకారం కూడా లోక్‌సభలో ప్రజల ముందు ఓడిపోయింది” అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యపై మీడియా ప్రతినిధి ఒకరు సీఎం రేవంత్ ను ప్రశ్నిస్తూ.. “మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ వ్యతిరేకమని మోదీ ప్రచారం చేస్తారు కదా?” అని అడగ్గా.. మహాభారతంలో శకునికి ఏమైందో చూశారు కదా అని రేవంత్ వ్యాఖ్యానించటం గమనార్హం.మొత్తంగా చూస్తే.. మోడీని భీమసేనుడితో పోల్చటం.. తాను బలవంతుడ్ని అంటూ అహంకారంతో విర్రవీగిన వేళ.. ఎదురుదెబ్బలు హనుమంతుడి రూపంలో ఎదురవుతాయన్న పోలిక కొంతమేర సూట్ అవుతుందనే చెప్పాలి. అయితే.. ఇదంతా ప్రజల నుంచి వచ్చిందనే కన్నా.. విపక్షపార్టీలు ఈ విషయంలో తగ్గేదేలే.. అన్నట్లుగా వ్యవహరించటంతోనే అన్నది మర్చిపోకూడదు. విపక్షాలు కోరినట్లుగా బిల్లులో మార్పులు చేసేందుకు..దేశంలోని రాష్ట్రాల్లో సీట్ల పెంపుపై ఒక జాబితా ఇవ్వాలని కోరుతూనే.. మళ్లీ విషయాన్ని పక్కన పెట్టేయటం.. తాము అడిగినట్లే.. రాష్ట్రాల్లో ఎన్నేసి సీట్లు పెరుగుతాయన్న దానిపై పదిహేను నిమిషాల్లో సభ ముందుకు పెడతామని అమిత్ షా స్వయంగా చెప్పినప్పటికి.. విషయాన్ని పక్కకు తీసుకెళ్లేలా చేసి.. అమిత్ చెప్పిన లిస్టు రెఢీ కాకుండా ఉండేలా చేయటంలో విపక్షాలు సూపర్ సక్ అయ్యాయని చెప్పాలి. ఏమైనా.. టైమ్లీగా పురాణాల్లోని క్యారెక్టర్లను తెర మీదకు తీసుకొచ్చి పిట్టకథలతో అత్యుత్తమ స్థాయి వారికి చేరువయ్యేలా సీఎం రేవంత్ టాలెంట్ ఉందని చెప్పక తప్పదు.

## బ్యాంకు అధికారులే సూత్రధారులు: రూ.150 కోట్ల భారీ సైబర్ నెట్‌వర్క్ గుట్టురట్టు!

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఒక భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. సామాన్యుల సొమ్ముకు రక్షణగా ఉండాల్సిన బ్యాంకు అధికారులే నేరగాళ్లతో చేతులు కలిపి ఈ భారీ స్కామ్‌కు తెరలేపడం విస్మయానికి గురిచేస్తోంది. సుమారు రూ.150 కోట్ల మేర జరిగిన ఈ మోసాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 850 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా సైబర్ నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానంతో మోసాలకు పాల్పడుతుంటారు. కానీ, ఇక్కడ బ్యాంకు అధికారులే నేరగాళ్లతో కుమ్మక్కయ్యారు. సైబర్ నేరాల ద్వారా సంపాదించిన డబ్బును దారి మళ్లించేందుకు బ్యాంకు అధికారులు నేరగాళ్లకు ‘మ్యూల్ అకౌంట్లు’ (వీబశ్రీవ ాషఎశీబత్ం) అందించారు. కేవైసీ (ఖ్జ) నిబంధనలను పక్కన పెట్టి, నకిలీ పత్రాలతో లేదా అమాయకుల పేరుతో ఖాతాలు తెరిచి నేరగాళ్లకు సహకరించారు.



**వందల కోట్లలో లావాదేవీలు..**

పోలీసుల ప్రాథమిక విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెట్‌వర్క్ ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.150 కోట్లు చేతులు మారాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నమోదైన దాదాపు 850 సైబర్ కేసుల్లో ఈ అకౌంట్లనే వాడినట్లు టెక్నికల్ అనాలిసిస్‌లో తేలింది. ఒక్కో అకౌంట్ తెరిచినందుకు మరియు లావాదేవీలు సజావుగా సాగేలా చూసినందుకు బ్యాంకు అధికారులు నేరగాళ్ల నుంచి భారీ మొత్తంలో కమీషన్లు తీసుకున్నట్లు సమాచారం. ఈ ముఠా అరెస్టుతో మరిన్ని కీలక విషయాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. “బ్యాంకు సిబ్బంది సహకారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున మ్యూల్ అకౌంట్లు నడపడం అసాధ్యం. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం,” అని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ప్రజలు తమ బ్యాంక్ ఖాతా వివరాలను, ఓటీపీలను ఎవరికీ తెలపవద్దని, అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# మండుటెండలో పలకరించిన వరుణుడు: పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎండవేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు వరుణుడు ఉపశమనం కలిగించాడు. ఆదివారం సాయంత్రం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆకస్మికంగా వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడగా, మరికొన్ని చోట్ల వడగండ్లు కురిశాయి. ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది.

ఎల్బీనగర్‌తో పాటు మీర్‌పేట్, కర్మాన్‌ఘాట్ పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మూసాపేట్, బాలానగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షంతో పాటు వడగండ్లు (ఝఱశ్రీరశీఅవం) పడటంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వడగండ్లను ఏరుకుంటూ జనం సందడి చేశారు.

**ట్రాఫిక్ జామ్.. ఉపశమనం..**

అకస్మాత్తుగా కురిసిన వర్షం వల్ల ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రధాన రోడ్లపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. అయితే, గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఒక్కసారిగా వాతావరణాన్ని చల్లబరచడంతో ఎంతో ఊరటనిచ్చింది. రానున్న కొద్ది గంటల్లో నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

## రేవంత్ సీఎం కావడానికి అవే కారణం: బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి అబద్ధాల పునాదులపై ముఖ్యమంత్రి అయ్యారని, అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రజలను, ముఖ్యంగా మహిళలను మోసం చేస్తూనే ఉన్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బండి సంజయ్ విమర్శించారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తానని రేవంత్ రెడ్డి మాట తప్పారు. నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. తులం బంగారం, స్కూటీల పేరుతో ఆశలు రేపి మహిళలను నిలువునా ముంచారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, ఇప్పుడు చేస్తున్న పాలనకు అసలు పొంతన లేదు. మహిళా బిల్లును అడ్డుకోవాలని చూస్తూ రేవంత్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటరీ నియోజకవర్గాల విభజనపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు అని బండి సంజయ్ ఆరోపించారు.

**కేసీఆర్ తరహాలోనే రేవంత్ పాలన..**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన మోసాలే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ పునరావృతమవుతున్నాయని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ఏ విధంగా అయితే అబద్ధాలు, మోసాలతో తెలంగాణను పాలించారో, రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తున్నారు. పేరు మారింది కానీ, ప్రజలను వంచించే తీరు మాత్రం మారలేదు. అబద్ధాలతో ఎంతో కాలం నెట్టుకు రాలేరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా అబద్ధాలు మాని, మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## మహిళా రిజర్వేషన్‌ను 2024లో ఎందుకు అమలు చేయలేదు: కడియం కావ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని 2023లోనే అన్ని పార్టీల సమ్మతితో బిల్లు ఆమోదం పొందిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ అనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ 2023 లోనే అన్ని రాజకీయ పార్టీల అనుమతితో మహిళా బిల్లు ఆమోదం పొందితే ఆనాడే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన బీజేపీ ప్రభుత్వం ‘జనగణన’ ‘డిలిమిటేషన్’ పేర్లతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముసుగుగా పెట్టుకుని, డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా రాజకీయ లాభాలు పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.దక్షిణాది రాష్ట్రాలపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రస్తావిస్తూ, కుటుంబ నియంత్రణ పాటించి అభివృద్ధికి తోడ్పడిన సౌత్ రాష్ట్రాలను శిక్షించేలా డిలిమిటేషన్ చేయడం సరికాదన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే శక్తులు ముందుకు రావాలి**

దేశ జీడీపీలో గణనీయమైన వాటా ఇస్తున్న దక్షిణాదిని కేంద్రం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రాజకీయ శక్తులు బీజేపీకి లొంగిపోతూ దక్షిణాది ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.ఈ నేపథ్యంలో పార్టీలు అతీతంగా అన్ని దక్షిణాది రాష్ట్రాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే శక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. “డిలిమిటేషన్ పేరిట జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలి. రాజ్యాంగాన్ని, సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకోవాలి” అని కడియం కావ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై ఏ కేసు పెట్టాలి? కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్యారెంటీ హామీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే విమర్శించారు. హామీలు ఇచ్చి ప్రజలతో ఓట్ల వేయించుకుని ఆ తర్వాత ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను పిక్ పాకెటింగ్ చేస్తున్నారని ఇలా చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై ఏ కేసు పెట్టాలని ప్రశ్నించారు. ఇవాళ హైదరాబాద్?లో మీడియాతో మాట్లాడిన ఆమె లోక్?సభలో రాహుల్ గాంధీ తీరు సరిగా లేదన్నారు. మహిళా రిజర్వేషన్స్, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోతే ఇండియా కూటమి సంబరాలు చేసుకున్నారంటే మీ ఉద్దేశం ఈ దేశాన్ని ఉత్తర, దక్షిణ భారత దేశంగా విచ్చిన్నం చేయడమేనని ధ్వజమెత్తారు.

**తేజస్వీ వ్యాఖ్యలపై..**

తనకు మరో గంట అవకాశం ఇస్తే ప్రతి రాష్ట్రానికి అదనంగా 50 సీట్లు అదనంగా కేటాయిస్తూ బిల్లును తీసుకువస్తానని సభలోనే అమిత్ షా కోరినా విపక్షాలు ఎందుకు అంగీకరించలేదని నిలదీశారు. జనాభా లెక్కలతో బాటు కులగణన చేస్తున్నామని ఈ లెక్కలన్నీ 2031 వరకు సమగ్రంగా వస్తాయన్నారు. 2029 ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు, దక్షిణ భారత దేశంలో లోక్ సభ సీట్లు పెంచాలనే ఉద్దేశంతో మోడీ ఈ బిల్లును తీసుకు వచ్చారన్నారు. తేజస్వి వ్యాఖ్యలు ఎవరినైనా నొప్పిస్తే క్షమించాలన్నారు. అవమానించే ఉద్దేశంతో తేజస్వి ఆ వ్యాఖ్యలు చేయలేదు.

# కేంద్రం ప్రకటనలకే పరిమితం

- 3 పేజి తరువాయి

చేసుకోవాలన్నారు. అధికంగా వరి ఉత్పత్తి అయినప్పటికీ, ధాన్యం సేకరణను ప్రతి సంవత్సరం తగ్గించడం, దొడ్డు బియ్యం సేకరణ విషయంలో మాట మార్చడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. సోయాబీన్, చిక్కుడు, వేరుశనగ, పెసలు, పొద్దుతిరుగుడు వంటి పంటల ఉత్పత్తిలో కేవలం 25 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం పరిమితులు విధించడంతో మిగిలిన పంటను మద్ధతు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సి వస్తోందని, దీంతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతోందన్నారు.

మొక్కజొన్న పంట విషయంలో కూడా కేంద్రం కేవలం మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. పరిమితులకు మించిన పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు మొక్కజొన్న పంటను కూడా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని చెప్పారు. ఇందుకోసం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంట సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం, కనీసం యాసంగి సీజన్‌లో అయినా కేంద్రం కొనుగోళ్లలో అనుమతులు ఇస్తుందని ఆశించినప్పటికీ, ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. ఇప్పటికే 200కి పైగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 1,20,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు చెప్పారు. ధాన్యం కొనగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా తగ్గిస్తున్న లెవి అడ్డంకిగా మారుతుందని, పత్తి విషయంలో కొత్త పద్ధతి తీసుకురావాలి అని చూస్తుంది అని, వీటిని కూడా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. మొక్కజొన్న పంటను నాఫెడ్ ద్వారా కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని, శనగ, పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి, పూర్తిగా కొనుగోలు చేయాలని పలుమార్లు కోరిన కేంద్రానికి స్పందన లేకపోవడం బాధకరమన్నారు.

# చరిత్ర చెప్పి ఎందుకు బుక్ అవుతారు రేవంత్?

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలకు పెద్ద పీట వేసే విషయంలో కాంగ్రెస్ కు మించింది లేదని.. ఆ పార్టీ మహిళలకు అత్యున్నత పదవుల్ని కట్టబెట్టిన విషయంలో తిరుగులేని రికార్డు ఉన్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కొత్త చర్చకు తెర తీసినట్లైందని చెప్పాలి. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రాష్ట్రపతి.. ప్రధానమంత్రిగామహిళలు ఎంపిక అయ్యారని.. స్పీకర్ గా.. పార్టీ అధ్యక్షులుగా మహిళలు ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో బీజేపీకి అధ్యక్షులుగా ఎప్పుడూ మహిళలు ప్రాతినిధ్యం వహించలేదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇంతకూ ఆయన అన్నట్లుగా ఏ పార్టీ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరాన్ని తీసుకొచ్చాయి. నిజంగానే సీఎం రేవంత్ మాటల్లో నిజం ఎంత? అన్నది చూస్తే.. ఆసక్తికర కోణాలు కనిపిస్తాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల విషయానికి వస్తే కాంగ్రెస్ తిరుగులేని అధిక్యను ప్రదర్శిస్తుంది. దాదాపు 54 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన పార్టీగా కాంగ్రెస్ తొలిస్థానంలో నిలిస్తే.. బీజేపీ రెండోస్థానంలో నిలుస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు బీజేపీ కేంద్రంలో 18 సంవత్సరాలకు పైనే అధికారంలో ఉంది. ఇందులో మోడీ ప్రస్తుత కాలాన్ని మినహాయిస్తే.. ఆ పార్టీ చాలా తక్కువ కాలం అధికారంలో ఉందని చెప్పాలి. ఈ సుదీర్ఘ కాలంలో ప్రధానమంత్రిగా మహిళలు ఏ పార్టీ నుంచి వచ్చారంటే.. కాంగ్రెస్ ఇందిరాగాంధీ పేరు తెర మీదకు వస్తుంది. బీజేపీలో ఎవరు కనిపించరు. అదే సమయంలో పార్టీ అధ్యక్ష పదవిని ఈ రెండు పార్టీల్లో ఎవరు ఎక్కువగా అవకాశాలు కల్పించారన్న చూస్తే.. మరో మాటకు అవకాశం లేకుండా కాంగ్రెస్ కనిపిస్తుంది. అయితే.. ఇక్కడ మరో ఆసక్తికర అంశాన్ని మర్చిపోకూడదు కాంగ్రెస్ పార్టీ పెట్టి ఇప్పటికి దాదాపు 140 సంవత్సరాలు పూర్తైనట్లుగా చెప్పాలి. అదే సమయంలో బీజేపీని ఏర్పాటు చేసి 46 ఏళ్లు మాత్రమే. ఎక్కడైనా.. ఎప్పుడైనా పోలిక తీసుకొచ్చినప్పుడు కాలాన్ని కచ్చితంగా ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. బీజేపీతో పోల్చినప్పుడు కాంగ్రెస్ 94 ఏళ్ల సీనియర్ అన్న విషయాన్ని మర్చిపోకూడదు. కాంగ్రెస్ పార్టీ ఆరంభం నుంచి ఇప్పటివరకు పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు అప్పచెప్పిన వైనంలో తిరుగులేని రికార్డు ఉంది. బీజేపీలో ఇప్పటివరకు ఒక్క మహిళ కూడా పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని చేపట్టినట్లుగా కనిపించదు. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. పార్టీ పెట్టిన ఆరంభంలో అనీ బెసెంట్, సరోజినీ నాయుడు, నెల్లీ సేన్‌గుప్తా లాంటి మహిళలు పార్టీకి జాతీయఅధ్యక్షులుగా వ్యవహరించారు.కానీ..కాంగ్రెస్ ఎప్పుడైతే వారసత్వానికి పెద్దపీట వేయటం మొదలైందో.. గాంధీ కుటుంబానికి చెందిన ఇందిరాగాంధీ..సోనియాగాంధీలే పార్టీకి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇక్కడ మహిళలకు పెద్ద పీట వేసిన విషయంలో కాంగ్రెస్ లో వారసత్వ కోణం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. కానీ.. ఆ పార్టీ అంత సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికి.. తాముకేంద్రంలో అధికారంలోఉన్న సమయంలో మహిళలకు కీలకమైన మంత్రిత్వ శాఖలు ఇచ్చారా? బీజేపీ ఇచ్చిందా? అన్నది చూసినప్పుడు కచ్చితంగా బీజేపీదేపైచేయి అవుతుంది. అందునా.. కాంగ్రెస్ కేంద్రంలోఅధికారంలో ఉన్న కాలంతో పోలిస్తే.. బీజేపీ చాలా తక్కువ కాలం అధికారంలో ఉన్న వైనం కనిపిస్తుంది. కేంద్రంలో మంత్రిత్వశాఖల విషయానికి వస్తే..ప్రాధాన్యత లేని శాఖలు మాత్రమే మహిళలకు కట్టబెట్టారు. అందుకు భిన్నంగా బీజేపీలో మాత్రం.. సుష్మా స్వరాజ్.. నిర్మలా సీతారామన్ లాంటి సామాన్య స్థాయినుంచి ఎదిగిన మహిళా నేతలకు అవకాశాల్ని కల్పించిన పార్టీగా బీజేపీ నిలుస్తుందని చెప్పాలి.
రాష్ట్రపతి పదవిని ఎంపిక విషయంలోనూ కాంగ్రెస్.. బీజేపీలు సరిసమానంగా కనిపిస్తాయి. అంతేకాదు..కాంగ్రెస్ తాను రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న సమయాల్లో ఐదుగురు మహిళల్ని ముఖ్యమంత్రులుగాచేసింది. బీజేపీవిషయానికి వస్తే.. ఆ పార్టీ కూడా ఐదుగురు మహిళా నేతల్నిముఖ్యమంత్రులుగా ఎంపిక చేయటం కనిపిస్తుంది. కేంద్రంలో 54 ఏళ్లు. రాష్ట్రాల్లో దశాబ్దాల పర్యంతం అధికారంలో ఉండి కూడా కేవలం ఐదుగురు ముఖ్యమంత్రులను మాత్రమే మహిళల్నిఎంపిక చేయటం చూసినప్పుడు.. వారు పాలించిన సమయం.. వారు సీఎంలుగా మహిళలకు అప్పజెప్పిన వైనం చూస్తే తక్కువగా కనిపిస్తుంది. అదే సమయంలో.. బీజేపీ తాను కేంద్రంలోనూ.. రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్న తక్కువ కాలంలోనే ఐదుగురు మహిళల్ని ముఖ్యమంత్రులుగా చేయటం చూస్తే.. ప్రాధాన్యత ప్రకారం మహిళలకు పెద్ద పీట వేసిన విషయంలో బీజేపీనే కనిపిస్తుంది. చరిత్రను చూసినా..గణాంకాల్నిచూసినా ఇదంతా కనిపించే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కాంగ్రెస్ మహిళలకు పెద్ద పీట వేస్తుందన్న వాదనలో పస లేదన్న విషయం అర్థమవుతుంది. మిగిలిన రాష్ట్రాల సీఎంలతో పోలిస్తే.. సీఎం రేవంత్ కాస్తంత హుషారు..చురుగ్గా ఉన్న ముఖ్యమంత్రిగా కనిపిస్తారు. ఇలాంటి వేళ.. ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేయటం తర్వాతి కాలంలో ఆయనకే నష్టం వాటిల్లేలా చేస్తాయన్న విషయాన్ని ఆయన గుర్తిస్తే మంచిది.

# పచ్చి అబద్ధాలకు.. బ్రాండ్ అంబాసిడర్ హరీష్ రావు




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ నేతల తీరుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిప్పులు చెరిగారు. హరీష్ రావు పచ్చి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజలను పక్కదోవ పట్టించడం తప్ప బీఆర్ఎస్ నేతలకు మరో ఆలోచన లేదని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత గులాబీ పార్టీదేనన్న ఆది శ్రీనివాస్.. కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకం అంటూఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు ఎవరూ అనుకోవడం లేదని.. కేవలం బీఆర్ఎస్ నేతలు మాత్రమే సొంత డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా క్రాస్ ఓటింగ్, పార్టీ ఫిరాయింపులపై ఆది శ్రీనివాస్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వారు మీకు మంచోళ్లు అయ్యారా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులకు పితామహుడు కేసీఆర్ అని.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు వాడుతున్న క్రాస్ బ్రీడ్, హైబ్రీడ్ వంటి పదజాలం వారికే వర్తిస్తాయని.. అధికారం కోసం, ప్రజలను దోచుకోవడం కోసమే వారి ఆరాటమంతా అని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ప్రతి మాటలోనూ అబద్ధాలు ఆడుతూ బీఆర్ఎస్ పార్టీ దిగజారి మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సభా స్థలిని పరిశీలించిన మంత్రులు శ్రీధర్ బాబు-తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివారం సాయంత్రం కాటారం మండలం నస్తురుపల్లి వద్ద సోమవారం జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థలిని రాష్ట్ర మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. సుమారు లక్ష మంది ప్రజలు హాజరుకానున్న ఈ సమావేశానకి రఘు ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా అధికారులను వారు ఆదేశించారు. పార్కింగ్ స్థలం వచ్చిన ప్రజలకు మంచినీరు మజ్జిగ లాంటి సౌకర్యాలకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని వారి బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా పోలీస్ అధికారికి సూచించారు.

# డ్రోన్ రివర్స్: కాంగ్రెస్ ఎమ్మెల్యేకు తప్పిన పెను ప్రమాదం



వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. డ్రోన్ ప్రారంభోత్సవంలో అపశృతి చోటు చేసుకోవడంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ పిచికారీ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ క్రమంలో మందులు పిచికారి చేసే డ్రోన్ల పంపిణీని ప్రారంభించారు. ఆ సమయంలో డ్రోన్ గాలిలోకి ఎగిరినట్లే ఎగిరి తిరిగి అది నేరుగా ఎమ్మెల్యేపైకి దూసుకువచ్చింది. ఈ ఘటనలో డ్రోన్ రెక్కలు తగిలి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి గాయాలయ్యాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది రామ్మోహన్ రెడ్డిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఎమ్మెల్యేకు వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మేటర్ సీరియస్.. అజ్జూ భాయ్‌కి అండగా సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మంత్రి అజరుద్దీన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్ ఈ నెల 30 లోగా ఏదైనా చట్టసభలో సభ్యుడిగా ఎన్నిక కావాల్సివుంది. అలాకాని పక్షంలో ఆయన మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. మంత్రి అజారుద్దీన్ తోపాటు ప్రొఫెసర్ కోదండరామ్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన ఫైల్ ను ఆమోదించాలని కోరారు. ప్రధానంగా మంత్రి అజారుద్దీన్ ను నామినేట్ చేసే అంశంపైనే సీఎం దృష్టిపెట్టారని చెబుతున్నారు. సాధారణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ లు యథాతథంగా ఆమోదిస్తారు. కానీ, తెలంగాణలో రాజకీయ పరిస్థితుల కారణంగా ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం పెండింగ్ లో పడిపోయినట్లు చెబుతున్నారు. మంత్రి అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ గత ఏడాది అక్టోబరు 28న తెలంగాణ మంత్రి మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానం ఆమోదించాల్సిందిగా గవర్నర్ కు సిఫార్సు చేసింది. ఇక ఆ నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేశారు.ఎమ్మెల్సీగా ప్రభుత్వం సిఫార్సు చేయడంతో అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. అజారుద్దీన్ మంత్రిగా ఉన్న సమయంలో గవర్నర్ జిష్ణుదేవ్ ఉండగా, తర్వాత ఆయన బదిలీ అయ్యారు. కొత్త గవర్నర్ గా శివప్రతాప్ శుక్లా వచ్చారు. ఈ కారణంగా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకం పెండింగులో ఉండిపోయినట్లు చెబుతున్నారు.
అయితే ప్రొఫెసర్ కోదండరాంకు సంబంధించి న్యాయవివాదం ఉండటంతోనే గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో అజారుద్దీన్ పేరును సైతం ఆమోదిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గవర్నర్ ఆమోదం లభించకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే ఈ పరిణామం రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి దెబ్బగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే గవర్నర్ నిర్ణయమేంటో మాత్రం తెలియలేదు. దీంతో అజ్జూభాయ్ మంత్రి పదవిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.

# రేవంత్ మాట.. 'పార్లమెంటులో ఏ బిల్లు మీద ఓటింగ్ జరిగినా తలుపులు మూస్తారు'



**హైదరాబాద్ పెన్ పవర్:** విషయాన్ని తమకు తోచినట్లుగా చెప్పటం చాలామంది చేసేదే. కాస్తంత తెలివైనోళ్లు అయితే.. ఈ విషయంలో మరింత తెలివితో వ్యవహరిస్తూ.. తప్పును ఒప్పును చేసే ప్రయాస పడుతుంటారు.అయితే.. నిజం అనేది ఒకటి ఉంటుందన్న విషయాన్ని వారు మర్చిపోతారు. నిజాన్ని నిజంలా ఒప్పుకోవటానికి ఇబ్బంది ఎందుకు? నిజాన్ని చెప్పకున్నా ఫర్లేదు.. జరిగిన తప్పును నిజంగా చిత్రీకరిస్తూ.. వాస్తవాన్ని మరుగన పడేయటం చాలా పెద్ద తప్పే అవుతుంది. తాజాగా తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ అలాంటి తీరునే ప్రదర్శిచారని చెప్పాలి. మహిళా బిల్లుతో పాటు.. రాజ్యాంగలోని 131వ సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలు.. కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యలు నిజమా? అబద్ధమా? అన్నది మరో చర్చ. ఆ విషయాన్ని పక్కన పెడితే.. తేజస్వి మాటల్ని ప్రస్తావిస్తూ.. ఒక ఆసక్తికర వ్యాఖ్య చేశారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.
పార్లమెంటులో ఏ బిల్లు మీద ఓటింగ్ జరిగినా తలుపులు మూస్తారని.. ఆ విషయం తేజస్వీకి తెలియదేమో అంటూ ఒకపెద్ద పాయింట్ చెప్పినట్లుగా రేవంత్ చేసిన వ్యాఖ్యల మీద మాత్రం చర్చ జరగాల్సిందే. ఎందుకంటే.. నిజాన్ని అబద్దంతో కప్పేయాలని చూడటం తప్పే అవుతుంది. ఈ తీరును ప్రదర్శించిన వారు ఎవరైనా సరే..వారి తప్పుల్ని ఎత్తి చూపించాల్సిన అవసరం ఉంది.నిజమే..సీఎం రేవంత్ చెప్పినట్లు లోక్ సభలో ఏదైనా బిల్లుపై చర్చ జరిగి.. ఓటింగ్ జరిగే సమయంలో తలుపులు మూస్తారు. అలా అని తలుపులు మూసే తీరును తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు (ఏపీ పునర్విభజన బిల్లు)వేళ జరిగిన ఘటనలతో మాత్రం పోల్చటం చరిత్రను తప్పుగా చెప్పటమే కాదు.. వాస్తవాల్ని వక్రీకరించటమే అవుతుంది. రాష్ట్ర విభజన జరిగి దగ్గర దగ్గర 12 ఏళు అవుతున్న నేపథ్యంలో.. ఇప్పటితరానికి అప్పట్లో ఏం జరిగిందన్న దానిపై అవగాహన తక్కువ అవుతుంది. అదే సమయంలో మెమరీ తక్కువగా ఉండేవారు.. సీఎం రేవంత్ చెప్పిన మాటలు అక్షర సత్యాలుగా భావిస్తే తప్పులో కాలేసినట్లే అవుతుంది.ముందుగా లోక్ సభలో ఏదైనా బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు.. ఓటింగ్ వేళలో తలుపులు మూస్తారు? అన్న సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు నూటికి నూరుపాళ్లు నిజం. ప్రొసీజర్ ప్రకారం చూస్తే..
సాధారణంగా బిల్లులను 'మౌఖిక ఓటింగ్' ద్వారా ఆమోదిస్తారు. కానీ, ఎవరైనా సభ్యులు ఈ పద్ధతిని వ్యతిరేకించి ఓట్లను రికార్డ్ చేయాలని కోరినప్పుడు (డివిజన్ అడిగినప్పుడు) మాత్రం స్పీకర్ పార్లమెంటు అంతటా డివిజన్ బెల్లును మూడున్నర నిమిషాల పాటు మోగేలా చేస్తారు.
ఆ సమయంలో ఎంపీలు ఎక్కడ ఉన్నా సభా ఛాంబర్ లోకి చేరుకోవాల్సి ఉంటుంది. బెల్ మోగడం ఆగిపోయిన వెంటనే, సభలోని అన్ని తలుపులను మూసివేస్తారు. ఆ తర్వాత ఎవరూ లోపలికి రావడానికి కానీ, బయటకు వెళ్లడానికి కానీ అనుమతి ఉండదు.
తలుపులు మూసిన తర్వాతే ఎంపీలు తమ సీట్లలో ఉన్న 'ఆటోమేటిక్ ఓట్ రికార్డింగ్' పరికరం ద్వారా అనుకూలంగా, వ్యతిరేకంగా, ఈ రెండింటికి సంబంధం లేకుండా తటస్థంగా ఓటు వేసే వీలుంది.
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రవేశ పెట్టిన ఏపీ పునర్విభజన బిల్లుపై ఓటింగ్ జరిగే వేళలో.. నాటి లోక్ సభలో ఏం జరిగింది? అన్నది చూస్తే.. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు వాస్తవానికి ఎంత దూరంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఇంతకూ ఆ బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు ఏం జరిగిందన్నది చూస్తే..ం 2014 ఫిబ్రవరి 18న లోక్ సభలో ఏపీ పునర్విభజన బిల్లు ఆమోదం పొందే వేళలో చోటు చేసుకున్న పరిస్థితులు సాధారణం.. అత్యంత అరుదైనవిగా చెప్పాలి. సాధారణంగా తలుపులు మూసి వేయటం అనేది ఓటింగ్ నమోదు కోసం చేసే ప్రక్రియ. కానీ.. ఆ రోజు ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా పేర్కొనే విధంగా.. టీవీలో లైవ్ చర్చను నిలిపేసి.. ఓటింగ్ జరుగుతున్న సమయంలో లోక్ సభలో టీవీ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయటం లాంటి పరిణామాలుచోటు చేసుకున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే భారత పార్లమెంట్ చరిత్రలో అత్యంత వివాదాస్పద నిర్ణయాల్లో ఒకటిగా చెప్పాల్సిందే. ఆ తర్వాత అధికారులు సాంకేతిక లోపంగా చెప్పినా..విపక్షాలు మాత్రం నాటి అధికారపక్షం పక్కా వ్యూహంతో చేసిన బ్లాక్ అవుట్ అన్నది తెలిసిందే. ఆ సమయంలో గ్యాలరీలో ఉన్న ప్రేక్షకులను.. మీడియాను సైతం నియంత్రించటాన్ని మర్చిపోలేం. అంతేకాదు.. మైకులు విరగ్గొట్టం.. దాడులకు ప్రయత్నాలు జరగటం లాంటివి జరిగాయి. తీవ్ర ఉద్రిక్తతల మధ్య విడివిడిగా రికార్డు చేసే డివిజన్ పద్ధతిని పాటించకకుండా..కేవలం మౌఖిక ఓటింగ్ ద్వారానేబిల్లును ఆమోదించిన వైనాన్ని మర్చిపోకూడదు.
వాస్తవం ఇలా ఉంటే.. అందుకు భిన్నంగా సీఎం రేవంత్ మాటలు ఉన్నాయని చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సరైనదా? కాదా? అన్నది ఇక్కడ చర్చ కానే కాదు. సీఎం రేవంత్ చెప్పినట్లుగా ప్రతి బిల్లు ఓటింగ్ వేళ లోక్ సభ లో అనుసరించే విధానాన్నే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై ఓటింగ జరిగినప్పుడుకూడా పాటించారన్నది అస్సలు నిజం కాదన్నది మర్చిపోకూడదు. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటివరకు ఏపీకి చెందిన ఏ ఒక్క రాజకీయ నేత కూడా మాట్లాడకపోవటం.. పెదవి విప్పకపోవటం చూస్తే.. ఏపీ రాజకీయ నేతలు.. ప్రజాప్రతినిధుల వ్యవహార శైలే భిన్నమన్న విషయం ఇట్టే అర్థమవుతుంది.

# స్టాలిన్ ని ఢీ కొడుతున్న బాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయేలో అత్యంత కీలకమైన భాగస్వామిగా ఉన్నారు అన్నది తెలిసిందే. ఎన్డీయేలో బీజేపీ 240 సీట్లతో తొలి స్థానంలో ఉంటే 16 మంది ఎంపీలతో టీడీపీ రెండో పెద్ద పార్టీగా ఉంది. దానికి తగినట్లే ఎన్డీయేలో టీడీపీకి బాబుకు విశేష ప్రాధాన్యత రాజకీయంగా లభిస్తోంది. ఇదిలా ఉంటే దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీయే విజయం కోసం మిత్ర పార్టీలు అన్నీ మద్దతుగా నిలిచి ప్రచారంలోకి దిగిపోయాయి. ఇక ఏపీకి పక్కనే ఉన్న తమిళనాడు విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఎన్ డీయే అభ్యర్ధుల తరపున ప్రచారానికి సిద్ధపడుతున్నారు.

**తమిళ సీమలో ప్రచారం :**

తమిళనాడు అంటే ఒకనాడు ఏపీతో కలసి ఉన్న రాష్ట్రమే. అంతే కాదు తెలుగు మాట్లాడే ప్రాంతాలు కూడా ఇక్కడ అధికంగా ఉన్నాయి. దాంతో బాబు ఎన్డీయే కూటమి తరపున ప్రచారానికి రంగంలోకి దిగిపోతున్నారు. ఈ మేరకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు తమిళనాడులో పర్యటించనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, హోసూరు, తళ్లి, ఆవడి, మధురైలలో ఎన్డీఏ పక్షాల అభ్యర్థుల తరపున బాబు ప్రచారం నిర్వహించనున్నారని తెలుస్తోంది.

**కోయంబత్తూరు నుంచే :**

ఇక ఈ నెల 20న ఉదయం అమరావతి నుంచి కోయంబత్తూరు బయల్దేరి వెళ్లనున్న చంద్రబాబు మధ్యాహ్నం ఒంటి గంటకు కోయంబత్తూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. ఆ విధంగా తొలి సభతో బాబు ఎన్నికల ప్రచారం మొదలై రెండు రోజుల పాటు ఉధృతంగా సాగుతుంది అని అంటున్నారు. కోయంబత్తూరు నుంచి హోసూరు నుంచి తళ్లి చేరుకుని బాబు అదే రోజు సాయంత్రం అక్కడ జరిగే ప్రచార ర్యాలీకి హాజరవుతారు. ఇక 20వ తేదీ రాత్రికి చెన్నై చేరుకుని ఆవడిలో జరగనున్న రోడ్ షోలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్ధుల తరపున ప్రచారం చేయనున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక చెన్నైలోనే బాబు రాత్రికి బస చేస్తారు. ఆ మరుసటి రోజు అంటే 21వ తేదీ ఉదయం చెన్నై నుంచి బయలుదేరి మధురైకి బాబు చేరుకుంటారు. మధురై సమీపంలోని సాత్తూర్ లో మధ్యాహ్నం ఒంటి గంటకు వివిధ సామాజిక వర్గాల నేతలతో సమావేశం ఆయన నిర్వహించనున్నారు. అనంతరం మూడు గంటలకు సాత్తూర్ లోనే ఎన్డీఏ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం మధురై నుంచి నేరుగా హైదరాబాద్ కు చేరుకుంటారు.

**పాత మిత్రునితో ఢీ :**

ఇదిలా ఉంటే స్టాలిన్ చంద్రబాబు పాత మిత్రులు. కరుణా నిధి కాలం నుంచి డీఎంకే టీడీపీల మధ్య మంచి స్నేహం ఉంది. ఎన్నో సార్లు కలసి పనిచేశారు. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలు భుజం కలిపి ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించాయి. అయితే బాబు ఇపుడు ఎన్డీయేలో ఉన్నారు. దాంతో స్టాలిన్

ప్రత్యర్థిగానే భావించి ఎన్నికల ప్రచారంలోకి దిగుతున్నారు. తమిళనాడులో త్రిముఖ పోరు సాగుతోంది. ఎన్డీయేలో అన్నా డీఎంకే బీజేపీ ఇతర పార్టీలు ఉన్నాయి. ఒక విధంగా బీజేపీ తమిళనాడుని ప్రతిష్టగా భావిస్తోంది. దాంతో బాబుతో ప్రచారం చేయిస్తోంది అని అంటున్నారు తమిళనాడులో కూడా బాబుకు ఆదరణ ఉంది కాబట్టి అది ఓట్ల రూపంలో మారుతుందని బీజేపీ పెద్దలు విశ్వసిస్తున్నారు. ఇక తమిళనాడులో బాబు ఏమి మాట్లాడుతారు, స్టాలిన్ మీద ఏ రకమైన విమర్శలు చేస్తారు అన్నది చూడాల్సి ఉంది.

# మాజీ మంత్రి అంబటి ఒకరోజు దీక్ష.. టీడీపీ వ్యంగ్యాస్త్రాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు 12 గంటల నిరాహారదీక్ష ముగిసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయన గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్ష చేశారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ఈ నిరసన దీక్ష చేపట్టారు. అయితే ఈ దీక్ష విఫలమైందని, కనీసం వంద మంది కూడా అంబటికి సంఘీభావం తెలిపేందుకు రాలేదంటూ టీడీపీ విమర్శలు గుప్పిస్తోంది. గుంటూరు వేదికగా మాజీ మంత్రి అంబటి రాంబాబు నిర్వహించిన నిరసన దీక్ష రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది. జనవరి 31న తన ఇంటిపై పోలీసుల సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని, తనను అరెస్టు చేసి 18 రోజులు జైలులో పెట్టిన పోలీసులు, తన ఇంటిపై దాడి చేసిన కార్యకర్తలను కనీసం 18 నిమిషాలు కూడా పోలీసు స్టేషన్ లో పెట్టలేదని అంబటి రాంబాబు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తనను అరెస్టు చేసిన నల్లపాడు పోలీసులు కస్టడీలో హింసించారని ఆరోపించారు.పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంబటి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతోనే టీడీపీ కార్యకర్తలు తన ఇంటిపై దాడి చేశారని అంబటి ఆరోపించారు. పోలీసులు తమ వాహనాలకు టీడీపీ జెండాలు కట్టుకుని తిరగాలని ధ్వజమెత్తారు. దాడిని ప్రోత్సహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని,

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదిలిపెట్టమని మాజీ మంత్రి అంబటి హెచ్చరించారు.

అయితే అంబటి దీక్షకు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇంచార్జి నూరీ ఫాతిమా సంఘీభావం తెలిపారు. పలువురు కార్యకర్తలు సైతం అంబటి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. అయితే అధికార పక్షం మాత్రం అంబటి దీక్షను ఎద్దేవా చేస్తూ విమర్శలు గుప్పిస్తోంది. ఈ దీక్షతో అంబటికి ప్రజల్లో ఎంత బలం ఉందో స్పష్టమైందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కనీసం వంద మంది అయినా దీక్షా శిబిరాన్ని సందర్శించలేదని, పట్టుమని పది మంది కూడా శిబిరం లేరంటూ ఎద్దేవా చేస్తున్నారు. దీంతో అంబటి దీక్షపై ఇరుపార్టీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది.

# మరో యుద్ధం తప్పదా..? కిమ్ జోంగ్ పంపుతున్న హెచ్చరికలు అర్థం అదేనా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచం మొత్తం పశ్చిమాసియా యుద్ధంపై దృష్టి సారించిన వేళ, కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ తన క్షిపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో 'రెడ్ అలర్ట్' ప్రకటించేలా చేస్తున్నారు. ఆదివారం ఉదయం సిన్పో తీరం నుంచి జరిగిన ఈ ప్రయోగాలు కేవలం ఆయుధ పరీక్షలు మాత్రమే కాదు, అవి దక్షిణ కొరియా, జపాన్ దేశాల సహనాన్ని పరీక్షిస్తున్న హెచ్చరికలు.

**వరుస క్షిపణులతో కిమ్ జోంగ్ ఉన్ అలజడి..**

అంతర్జాతీయ సమాజం ఎన్ని ఆంక్షలు విధించినా, ఐక్యరాజ్యసమితి ఎన్ని తీర్మానాలు చేసినా ఉత్తర కొరియా తన పంథాను మార్చుకోవడం లేదు. తాజాగా ఆదివారం ఉదయం ఆ దేశం జరిపిన బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలు పొరుగు దేశాలైన దక్షిణ కొరియా, జపాన్‌లను గజగజ వణికిస్తున్నాయి. ఈ ఏడాదిలోనే ఇది నాలుగోసారి కావడం, అది కూడా నేరుగా సముద్ర తీరాల నుంచి ప్రయోగించడం కిమ్ జోంగ్ ఉన్ మొండివైఖరికి అద్దం పడుతోంది. ప్యాంగ్‌యాంగ్ చేస్తున్న ఈ కవ్వింపు చర్యలు తూర్పు ఆసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితిని సృష్టించాయి.

**సిన్పో నుంచి సముద్రం వరకు..**

దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ నివేదిక ప్రకారం.., ఉత్తర కొరియా తన తూర్పు తీరంలోని సిన్పో ప్రాంతం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించింది. ఈ క్షిపణులు జపాన్ ఆర్థిక మండలికి సమీపంలో ఉన్న సముద్రంలో పడినట్లు గుర్తించారు. ఇవి స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులైనా, వీటి వేగం, ఖచ్చితత్వం గతంలో కంటే మెరుగ్గా ఉన్నాయని జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాను, దాని మిత్రదేశాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యాన్ని తాము పెంచుకుంటున్నామని ఉత్తర కొరియా పరోక్షంగా సంకేతాలు ఇస్తోంది.

**అప్రమత్తమైన పొరుగు దేశాలు**

ఉత్తర కొరియా కదలికలతో దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం వెంటనే స్పందించింది. పరిస్థితిని సమీక్షించడానికి 'జాతీయ భద్రతా మండలి' అత్యవసరంగా భేటీ అయ్యింది. ఉత్తర కొరియా చేసే ఏ చిన్న సాహసానికైనా ధీటుగా సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు తమ నిఘా వ్యవస్థలను అనుసంధానించాయి. ఉత్తర కొరియా అణు కేంద్రాల్లో కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి.

**కిమ్ జోంగ్ ఉన్ అణు ఆకాంక్షలు**


గత వారం ఒక యుద్ధ నౌక నుంచి జరిగిన క్షిపణి ప్రయోగాన్ని స్వయంగా పర్యవేక్షించిన కిమ్, తన సైన్యానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. దేశం వద్ద ఉన్న అణ్వస్త్రాలను 'భారీగా విస్తరించడమే' తన ప్రధాన అజెండా అని ప్రకటించారు. శత్రువుల నుంచి ముప్పు పొంచి ఉన్నప్పుడు అణుదాడి సామర్థ్యమే తమకు రక్షణ అని ఆయన నమ్ముతున్నారు.

అంతర్జాతీయ అణుశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ మాటలు మరింత భయపెడుతున్నాయి. ఉత్తర కొరియాలోని అణు రియాక్టర్లలో కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయని, వారు ప్లుటోనియం నిల్వలను పెంచుకుంటున్నారని ఆయన ధృవీకరించారు.

**ఐక్యరాజ్యసమితి తీర్మానాలు బేఖాతరు**

బాలిస్టిక్ క్షిపణులను వాడకూడదని ఉత్తర కొరియాపై ఇప్పటికే అనేక ఆంక్షలు ఉన్నాయి. కానీ, ఆ దేశానికి మద్దతుగా నిలిచే రష్యా, చైనా వంటి దేశాల వల్ల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కొత్త ఆంక్షలు విధించడం కష్టమవుతోంది. ఇదే అదనుగా భావిస్తున్న కిమ్, తన క్షిపణి సాంకేతికతను శిఖరాగ్రానికి చేరుస్తున్నారు. తూర్పున ఉత్తర కొరియా, పశ్చిమాన ఇరాన్.. ఇలా రెండు వైపులా యుద్ధ వాతావరణం నెలకొనడం ప్రపంచ శాంతికి పెను సవాలు. దక్షిణ కొరియా కూడా తన రక్షణ బడ్జెట్‌ను పెంచి, అమెరికాతో కలిసి భారీ సైనిక విన్యాసాలు చేస్తోంది. ఈ పోటీ ఇలాగే కొనసాగితే, ఏదో ఒక చిన్న పొరపాటు కొరియా ద్వీపకల్పంలో మరో భీకర యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. కిమ్ జోంగ్ ఉన్ క్షిపణి గర్జనలు కేవలం పొరుగు దేశాలనే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా కుదిపేస్తున్నాయి.

# ఒకసారే నిజరూపం...మహిమ అద్భుతం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఎక్కడ ఆలయాల్లో అయినా స్వామి వారి అసలు రూపంతోనే దర్శనం భక్తులకు లభిస్తుంది. కానీ ఏకైక ఆలయంగా విశాఖలోని సింహాచలం శ్రీ వరాహ నరసింహ స్వామి వారి ఆలయంలో మాత్రమే ఏడాది మొత్తం స్వామి చందనంతో కప్పబడి ఉంటారు. ఒకే ఒక్క రోజున ఆయన నిజ రూపం కనిపిస్తుంది. అలా ఆ ఒక్క రోజునే స్వామిని దర్శించుకుని తరించే అవకాశం దక్కుతుంది. ఆ రోజు వైశాఖ శుద్ధ తృతీయ. దానినే అక్షర తృతీయగా కూడా చెబుతారు. అందుకే సింహాచలంలో చందనోత్సవం రోజు అంటే ఏపీ తెలంగాణా మాత్రమే కాదు ఒడిశా చతీష్ ఘడ్ వంటి చోట్ల నుంచి భక్తులు వేలల్లో తరలి వస్తారు. ఏడాదికి ఒకసారి కనిపించే నిజ రూప దర్శన భాగ్యాన్ని అందుకునేందుకు క్యూలు కడతారు. గంటల తరబడి వేచి ఉండి మరీ స్వామి రూపాన్ని చూసి జన్మ ధన్యం అయిందని ఆధ్యాత్మిక ఆనందాన్ని గుండె నిండా నింపుకుని వెనక్కి మరలుతారు.

**పుట్టలో వెలసిన స్వామి :**

ఇదిలా ఉంటే నిజ రూప దర్శనం వెనక ఆసక్తిని కలిగించే పురాగణ గాథ ఒకటి ఉంది. స్వామి వారి విగ్రహం పుట్టలో దొరికింది. దాని కోసం సాగిన అన్వేషణ కూడా ఎంతో ఉత్కంఠగా ఉంటుంది. యుగాల క్రితం చంద్రవంశానికి చెందిన పురూరవ చక్రవర్తి అలా ఆకాశమార్గాన పయనిస్తూ ఉంటే ఆయన విమానం సింహాచలం క్షేత్ర సమీపంలోకి వచ్చాక ముందుకు కదలక ఆగిపోతుంది. దాంతో పురూరవ చక్రవర్తి అక్కడే నేల మీదకు దిగుతాడు. ఆయనకు ఆ సమయంలో అక్కడ అడవిలో పూర్తిగా పుట్టతో కప్పబడిన స్వామి వారి విగ్రహం కనిపిస్తుంది. ఆయన పుట్టను సమీపంలోని గంగా జలంతో తొలగించి స్వామిని కనుగొంటాడు. అయితే ఉగ్ర రూపంలో ఉన్న ఆ నిజ మూర్తిని చూసిన పురూరవ చక్రవర్తి ఆశ్చర్యపోతాడు, భీతిల్లుతాడు. ఆ సమయంలో ఆకాశవాణి ఆయనకు చెబుతుంది. భక్తులు ఎవరూ నిజరూపం సాధారణ రోజులలో చూడలేరని అందువల్ల తిరిగి ఆ విగ్రహాన్ని కప్పి ఉంచి అక్కడే ప్రతిష్టించాలని. దాంతో చందనం పూసి ఆ విగ్రహాన్ని చక్రవర్తి అక్కడ కొలువు తీరుస్తాడు. సింహాచలం క్షేత్రాన్ని కూడా ఆయనే నిర్మిస్తాడు. అలా ఏడాదికి ఒకసారి స్వామి నిజరూప దర్శనం సంప్రదాయం కూడా ఆయనే ప్రారంభించారు. అదే తరువాత కాలంలో సింహాచలం గా ప్రసిద్ధి చెందింది. నాటి నుంచి స్వామి భక్తుల కోరిక మేరకు ఏడాదికి ఒకసారి నిజ రూపం దర్శనం ఇస్తాడు.

**నిజరూపం ఎలా ఉంటుందంటే :**

స్వామి ఏడాది పొడవునా చందనంతో కప్పబడి లింగాకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. కానీ నిజ రూపంలో ఎలా ఉంటారు అన్న ఆసక్తి అందరికీ ఉంటుంది. స్వామి వరాహ ముఖంతో నరుని శరీరంతో నిజ రూపంలో ఉంటారు. శ్వేత వర్ణంతో రెండు చేతులతో ఉంటారు. స్వామివారి భుజంపై తోక ఉంటుంది. అలాగే తలపై తెల్లని జూలు ఉంటుంది. ఇక నిజరూపంలో స్వామివారి పాదాలను దర్శించుకోవచ్చు. అక్షయ తృతీయ నాడు తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనాలు భక్తులకు లభిస్తాయి. ఇక నిజరూప దర్శనం అయిన వెంటనే స్వామివారికి మళ్లీ చందనం పూస్తారు. అయితే సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నిజరూప దర్శనం అనేది సింహాచల క్షేత్రంలో జరిగే అత్యంత పవిత్రమైన విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యక్రమంగా ఉంటుంది.

**శ్రీకృష్ణదేవరాయల కాలంలో :**

సింహాచలం ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఎంతో అభివృద్ధి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు స్వామి వారిని దర్శించుకుని మరీ ఎన్నో అభరణాలు ఆయనకు కానుకగా సమర్పించారు. అంతే కాదు రత్నాల హారాలను బహుమతిగా అందించి భక్తితో కొలిచారు. దాని కంటే ముందు ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో తూర్పు గంగా రాజవంశానికి చెందిన నరసింహ దేవుడు ఈ అభివృద్ధి చేశారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆధునిక కాలంలో ప్రభుత్వాలు కూడా ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తూ వస్తున్నాయి. గతానికి పోలిస్తే స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నారు.

# అమెరికా వీసా కష్టాలు: 9 ఏళ్లలో 4 సార్లు తిరస్కరణ.. ఒక భారతీయ కుటుంబం ఆవేదన!

**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలనేది చాలా మంది భారతీయుల కల. అయితే ఆ కల నెరవేరాలంటే పాస్‌పోర్ట్‌పై 'యూఎస్ వీసా' ముద్ర పడటం అంత తేలికైన విషయం కాదని మరోసారి రుజువైంది. తాజాగా ఒక భారతీయ కుటుంబానికి ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ముఖ్యంగా రెడిట్ లో పెద్ద చర్చకు దారి తీసింది. తొమ్మిదేళ్ల వ్యవధిలో ఏకంగా నాలుగు సార్లు ప్రయత్నించినా అమెరికా విజిటర్ వీసా (బీ1/బీ2) లభించకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

**దశాబ్ద కాలంగా సాగుతున్న వీసా పోరాటం**

సదరు కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. వారి వీసా ప్రయత్నాలు 2017లో ప్రారంభమయ్యాయి. అప్పట్లో ఒక కుటుంబ వివాహానికి హాజరుకావడానికి రెండుసార్లు దరఖాస్తు చేసుకోగా రెండుసార్లూ తిరస్కరణకు గురయ్యారు. అనంతరం 2018లో తమ కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు వెళ్లాలని భావించి మూడోసారి దరఖాస్తు చేశారు. కొడుకు చదువు పూర్తి చేసుకుంటున్న ఆ మధుర క్షణాలను ప్రత్యక్షంగా చూడాలనుకున్న ఆ తల్లిదండ్రులకు అప్పుడు కూడా నిరాశే ఎదురైంది. వరుసగా మూడుసార్లు తిరస్కరణ ఎదురవడంతో ఆ కుటుంబం తమ ప్రొఫైల్‌ను మరింత పటిష్టం చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా గత కొన్నేళ్లలో కెనడా, సింగపూర్, మలేషియా వంటి దేశాలను సందర్శించి బలమైన 'ట్రావెల్ హిస్టరీ' ని నిర్మించుకున్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని నిరూపించే పత్రాలు స్వదేశంలో తమకున్న బలమైన బంధాలను చూపే ఆధారాలను సిద్ధం చేసుకుని, 2026లో నాలుగోసారి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ విధి వెక్కిరించినట్లు ఈసారి కూడా వారికి వీసా లభించలేదు.

**సెక్షన్ 214(బీ): అతిపెద్ద అడ్డంకి**

ఈసారి కూడా వీసా తిరస్కరణకు కారణంగా సెక్షన్ 214(బీ)ని చూపించారు. అమెరికా వలస చట్టాల ప్రకారం వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తి 'సంభావ్య వలసదారు' అని అధికారులు భావిస్తారు. దరఖాస్తుదారుడు తన పర్యటన ముగిసిన తర్వాత తిరిగి సొంత దేశానికి వస్తాడనే బలమైన సాక్ష్యాధారాలను చూపడంలో విఫలమైతే ఈ సెక్షన్ కింద వీసాను తిరస్కరిస్తారు.

అయితే ఆ కుటుంబం వాదన మరోలా ఉంది. తాజా ఇంటర్వ్యూ కేవలం రెండు నిమిషాల్లోనే ముగిసిపోయిందని, తమ ఆర్థిక స్థితిగతులు లేదా ఉద్యోగ బాధ్యతలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ప్రభుత్వ ప్రాజెక్టులతో సంబంధం ఉన్న నిర్మాణ రంగ వ్యాపారిగా ఉండటం.. ఇంట్లో వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత ఉండటం వంటి అంశాలేవీ అధికారులను మెప్పించలేకపోయాయి.

**బంధుత్వాలే శాపమా?**

ఈ ఉదంతంలో మరో ఆసక్తికరమైన కోణం ఏమిటంటే ఆ కుటుంబానికి అమెరికాలో ఉన్న బలమైన సంబంధాలు. వారి ఒక కుమారుడు 2016 నుంచి అక్కడే స్థిరపడి వివాహం చేసుకుని ఉంటున్నారు. అలాగే తండ్రి సోదరుడు కూడా గ్రీన్ కార్డ్ హోల్డర్. సాధారణంగా విదేశాల్లో బంధువులు ఉంటే వీసా సులభంగా వస్తుందని భావిస్తారు. కానీ ఇక్కడ అదే వారికి ప్రతిబంధకంగా మారిందని అనుమానిస్తున్నారు. అమెరికాలోనే బంధువులు ఉండటం వల్ల వీరు కూడా అక్కడికి వెళ్లి తిరిగి రారేమోనన్న సందేహం అధికారులకు కలిగి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**నెటిజన్ల స్పందన.. ఆందోళన**

ఈ పోస్టుపై స్పందిస్తున్న నెటిజన్లు అమెరికా వీసా ప్రక్రియలోని అపారదర్శకతను తప్పుపడుతున్నారు. వేల రూపాయల ఫీజు చెల్లించి, నెలల తరబడి వెయిట్ చేసినా, కనీసం దరఖాస్తుదారుడి గోడు వినకుండానే సెకన్ల వ్యవధిలో నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. బలమైన ఆర్థిక నేపథ్యం, ట్రావెల్ హిస్టరీ ఉన్నప్పటికీ వీసా రాకపోవడం విచారకరమని అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద ఈ ఘటన అమెరికా విజిటర్ వీసా పొందడం అనేది కేవలం అర్హతపైనే కాకుండా ఆ సమయానికి ఉండే 'లక్' పైన కూడా ఆధారపడి ఉంటుందనే చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బంగారం తులం రూ. 2 లక్షలకు చేరనుందా..? ఆ నివేదికలు చెప్తున్నదేంటి..?



ఈ ఏడాది అక్షయ తృతీయ బులియన్ మార్కెట్ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. సామాన్యుడు తులం బంగారం రూ. 1.5 లక్షలు దాటుతుందని ఊహించి ఉండకపోవచ్చు, కానీ ఏడాదిలో 63.4% రాబడి ఇవ్వడం అనేది పసిడి పట్ల భారతీయులకున్న నమ్మకాన్ని మరింత పెంచింది. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకొని, సురక్షితమైన పెట్టుబడిగా బంగారం తన 'విశ్వరూపాన్ని' ప్రదర్శిస్తోంది.

**అక్షయ తృతీయ వేళ రూ. 2 లక్షల వరకు పరుగులు..**

భారతీయ సంస్కృతిలో బంగారం కేవలం అలంకరణ వస్తువు కాదు, అది ఆపత్కాలంలో ఆదుకునే ఆర్థిక రక్షణ కవచం. 19 ఏప్రిల్, 2026న అక్షయ తృతీయ జరుపుకుంటున్న తరుణంలో మార్కెట్ విశ్లేషణలు చూస్తుంటే పసిడి ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయని అర్థం అవుతోంది. ఏడాదిలో బంగారం చూపిన దూకుడు చూసి ఆర్థిక నిపుణులు కూడా విస్మయానికి గురవుతున్నారు. ఒకప్పుడు పదేళ్లకు ఒకసారి వచ్చే రాబడులను బంగారం ఇప్పుడు కేవలం ఒక్క ఏడాదిలోనే అందిస్తోంది.

**ఏడాదిలో 63% వృద్ధి..**

గత అక్షయ తృతీయ (2025) నుంచి నేటి వరకు బంగారం ధరల పెరుగుదల ఒక ప్రభంజనంలా సాగింది. 2025, ఏప్రిల్ చివరలో రూ. 94,611 వద్ద ఉన్న తులం బంగారం, నేడు రూ. 1,54,609 వద్ద ట్రేడ్ అవుతోంది. అంటే కేవలం 12 నెలల్లో సుమారు రూ. 59,998 పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు (యుద్ధ మేఘాలు), అమెరికన్ డాలర్ విలువలో ఒడిదుడుకులు, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు తమ ఫారెక్స్ నిల్వల కోసం టన్నుల కొద్దీ బంగారాన్ని పోగు చేయడం ఈ భారీ ర్యాలీకి ప్రధాన కారణాలు.

**18% సీఏజీఆర్ తో అప్రతిహత వృద్ధి**

గడిచిన దశాబ్ద కాలంలో బంగారం స్థిరమైన సంపద సృష్టికర్తగా నిలిచింది. కేడియా అడ్వయిజరీ నివేదిక ప్రకారం.., 2016 నుంచి 2026 వరకు బంగారం 18% వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) నమోదు చేసింది. 2020లో కరోనా సమయంలో 47% లాభం ఇవ్వగా, ఇప్పుడు 2026లో 63.4% రాబడితో సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. ఇది రియల్ ఎస్టేట్ లేదా స్టాక్ మార్కెట్ కంటే మెరుగైన ప్రదర్శన అని నిపుణులు చెబుతున్నారు.

**రూ. 2 లక్షల మార్కు..**

ప్రస్తుత వేగం చూస్తుంటే, వచ్చే అక్షయ తృతీయ (2027) నాటికి తులం బంగారం రూ. 2 లక్షల మార్కును తాకడం ఖాయమని వెంతురా సెక్యూరిటీస్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. 2026, డిసెంబర్ నాటికే ఇది రూ. 1.75 లక్షలకు చేరుకునే అవకాశం ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న ద్రవ్య లోటు వల్ల ఇన్వెస్టర్లు సురక్షితమైన ఆస్తిగా భావించే బంగారం వైపు మళ్లుతున్నారు. మోహిత్ గులాటి అన్నట్లుగా, బంగారం ధర పెరగడం కంటే డాలర్ బలహీనపడడం పైనే నిపుణులు ఎక్కువ ఆందోళన చెందుతున్నారు.

**బరువు తగ్గింది.. విలువ పెరిగింది!**

ధరలు ఆకాశాన్ని తాకడంతో భారతీయుల కొనుగోలు విధానంలో మార్పు వచ్చింది. ధరలు పెరగడం వల్ల కొనుగోలు సామర్థ్యం (టికెట్ సైజ్) 69% పెరిగినా, వాస్తవంగా కొనే బంగారం బరువు (టన్నేజీ) 31% పడిపోయింది. భారీ హారాల కంటే 18 క్యారెట్ల లైట్ వెయిట్ జ్యువెలరీకి డిమాండ్ పెరిగింది. అలాగే, మదుపర్లు ఆభరణాల కంటే 'గోల్డ్ కాయిన్స్', 'గోల్డ్ బిస్కెట్ల' రూపంలో పెట్టుబడి పెట్టడానికి మొగ్గు చూపుతున్నారు. 'ధర పెరుగుతుందనే భయంతో కొనే వారి కంటే, బడ్జెట్ చూసుకుని కొనే వారే ఎక్కువయ్యారు.' ధరలు ఎంత పెరిగినా భారతీయుడికి బంగారంపై ఉన్న మక్కువ తగ్గదు. అక్షయ తృతీయ నాడు కనీసం గ్రాము బంగారమైనా కొంటే శుభం జరుగుతుందనే నమ్మకం ఇప్పటికీ భారతీయుల నమ్మకంలో ముడిపడి ఉంది. ఇది పసిడి వ్యాపారాన్ని ముందుకు నడిపిస్తోంది. అయితే, కేవలం ఫిజికల్ గోల్డ్ మాత్రమే కాకుండా డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్, సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు కూడా యువత మొగ్గు చూపడం విశేషం. వచ్చే ఏడాది నాటికి రూ. 2 లక్షల మైలురాయిని చేరి బంగారం తన 'విశ్వరూపాన్ని' సంపూర్ణం చేస్తుందో లేదో వేచి చూడాలి.

# ఎవరి కోసం ఈ యుద్ధం? సొంత సైనికులకు తిండి పెట్టలేవా ట్రంప్?



బరిలోకి దిగి పోరాటం చేసే వాడికి ఏం ఇచ్చినా.. ఇవ్వకున్నా.. బలమైన ఆహారం.. బలమైన ఆయుధాలు. ఇవేమీ ఇవ్వకుండా పోరాడమంటే ప్రపంచంలో మరెవరూ పోరాడలేరు. ఆయుధాల విషయంలో ఎలాంటి సమస్య లేకున్నా.. సైనికులకు పెట్టాల్సిన తిండి విషయంలో అమెరికా వ్యవహరిస్తున్న వైనం.. సొంత సైనికుల తిండి విషయంలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై ఇప్పుడు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇరాన్ మీద అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో అమెరికన్ సైనికులకు అందుతున్న ఆహారంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తున్నాయి. రెండు పలచటి రోటీలు.. ఉడికించిన క్యారెట్ ముక్కలు.. కొంచెం మటన్.. ఇదే బాక్సుల రూపంలో అమెరికన్ సైనికులకు అందుతున్నరోజువారీ ఆహారం. పశ్చిమాసియాలో గత కొన్ని వారాలుగా యుద్ధ విధుల్లో పాలు పంచుకుంటున్న అమెరికన్ సైనికులకు ఇస్తున్న చాలీచాలని ఫుడ్ మెనూను తిట్టిపోస్తున్నారు. ఇరాన్ తోయుద్ధం మొదలైన తర్వాత నుంచి వేలాది మంది సైనికులను అమరికా నుంచి పశ్చిమాసియాకు పంపటం తెలిసిందే.అవసరమైతే హర్మూజ్ జలసంధి వద్ద అధిక్యత కోసం యూఎస్ఎస్ ట్రిపోలి.. యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ నౌకలు హర్మూజ్ జలసంధి వద్ద విధుల్లో పాల్గొంటున్నాయి. ఈ నౌకల్లో పని చేస్తున్న సైనికులు తమకు అందిస్తున్న ఫుడ్ ను తమ కుటుంబాలకు షేర్ చేసుకోవటంతో ఈ అరాచకం బయటకు వచ్చింది.కడుపు నిండా తిండి పెట్టకుండా యుద్ధం చేయమని చెప్పటం ఏం బాగుంటుందన్నది అసలు ప్రశ్న. ఇదిలా ఉంటే.. అమెరికాలోని కుటుంబాలు సైనిక విధుల్లో ఉన్న తమ వారికి ఫుడ్ పంపే వీలు లేకపోవటంతో చాలీచాలని తిండితో కిందా మీదా పడుతున్న పరిస్థితి.హర్మూజ్ జలసంధికి దగ్గరగా మోహరించిన ట్రిపోలి నౌక సైజు ఎంత పెద్దదంటే.. ఆ నౌకలో 3500 మంది సైనికులు ఉంటారు.ఇరాన్ కు చేరుగా ఉన్న ఈ నౌక మార్చి 27 నుంచి అక్కడే ఉంది. ఆహార సమస్య ఈ నౌకలోని సైనికులకు తీవ్రంగా వేధిస్తున్నట్లు చెబుతున్నారు. ఒకప్పుడు నాణ్యమైన ఆహారం గురించి మాట్లాడేవారని.. ఇప్పుడు ఆహారం దొరికితే అదే పది వేలు అన్నట్లుగా మారిందన్న మాట బలంగా వినిపిస్తోంది. సైనికులు ఎప్పుడూ ఆకలితో ఉండాల్సిన దుస్థితి నెలకొందన్న వాదన వినిపిస్తోంది.ఇరాన్ యుద్ధంలో భాగమైన మరో విమాన వాహన నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ విషయానికి వస్తే.. అందులో 4500 మంది సిబ్బంది ఉన్నారు. వీరంతా టాయిలెట్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే.. అందులోని టాయిలెట్లు పని చేయని కారణంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ఉద్రిక్తతలు చల్లారని వైనం ఒకవైపు.. నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధం అమెరికా సైనికులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. ఇదంతా చూసిన తర్వాత మదిలో మెదిలే ప్రశ్న ఒక్కటే.. ఈ యుద్ధం ఎవరి కోసం ట్రంప్? అన్న ప్రశ్నతో పాటు.. సొంత సైనికులకు సరైన తిండి పెట్టని అధినేతగా ట్రంప్ నిలిచిపోతారన్న మాట వినిపిస్తోంది.

# ఇరాన్ సంచలన నిర్ణయం.. హార్మ్యూజ్ పై స్టాండ్ ఇదే అంటూ ప్రకటన..!



పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచ ఇంధన మార్కెట్‌ను వణికించేలా ఉన్నాయి. ముఖ్యంగా 'హార్మ్యూజ్ జలసంధి' మూసివేత అనేది కేవలం అమెరికాకో, ఇజ్రాయెల్‌కో సంబంధించిన సమస్య కాదు.. అది ప్రపంచ దేశాలన్నింటికీ తలనొప్పిగా మారే అంశం.

**హార్మ్యూజ్‌పై ఉక్కుపిడికిలి..**

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హార్మ్యూజ్ జలసంధిని కేంద్రంగా చేసుకొని ఇరాన్, అమెరికా మధ్య మాటల యుద్ధం క్లైమాక్స్‌కు చేరుకుంది. ఇరాన్ రేవులపై అమెరికా విధిస్తున్న ఆర్థిక, వాణిజ్య దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు ఈ కీలక జలమార్గాన్ని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ చెప్పారు. అమెరికా ఆర్థిక, సైనిక శక్తిపై ఆయన చేసిన విమర్శలు పశ్చిమాసియాలో మారుతున్న యుద్ధ సమీకరణాలకు అద్దం పడుతున్నాయి.

**హార్మ్యూజ్ ప్రపంచ దేశాల గళం..**

ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురులో సుమారు 20 నుండి 30 శాతం ఈ సన్నని జలసంధి గుండానే వెళ్తుంది. గాలిబాఫ్ అన్నట్లుగా, అమెరికా తన సైనిక బలంతో ఈ జలసంధిని అదుపులోకి తీసుకోవాలని చూసింది. కానీ, ఇరాన్ క్షిపణి దళాలు, డ్రోన్ వ్యవస్థల పహారా ముందు అగ్రరాజ్యం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌ను ప్రపంచం నుంచి వేరు చేయాలని అమెరికా చూస్తే, తాము ప్రపంచ ఇంధన సరఫరానే నిలిపివేస్తామనే హెచ్చరికను ఇరాన్ పరోక్షంగా ఇస్తోంది. ఒకవేళ హార్మ్యూజ్ మూతపడితే భారత్ వంటి చమురు దిగుమతి దేశాల్లో పెట్రోల్ ధరలు ఊహించని రీతిలో పెరిగే ప్రమాదం ఉంది.

**ట్రంప్ వ్యూహాలపై 'గాలిబాఫ్' నిప్పులు**


అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై గాలిబాఫ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వెనిజులాలో పాలన మార్పు కోసం అమెరికా చేసిన ప్రయత్నాలు ఇరాన్ గడ్డపై సాగవని హెచ్చరించారు. ఇక్కడి ప్రజల దేశభక్తిని, సైనిక వ్యూహాలను అంచనా వేయడంలో అగ్రరాజ్యం విఫలమైందని ఎద్దేవా చేశారు. అమెరికా వద్ద డబ్బు, ఆయుధాలు ఉండవచ్చు కానీ, వాటిని సరిగ్గా ఉపయోగించే 'ప్రణాళిక' లేదని ఆయన విశ్లేషించారు. పరిమిత వనరులతోనే శత్రువును ఉక్కిరిబిక్కిరి చేసే సత్తా తమకు ఉందని ధీమా వ్యక్తం చేశారు.

**'అమెరికా ఫస్ట్' కాదు.. 'ఇజ్రాయెల్ ఫస్ట్'!**

ట్రంప్ ఎన్నికల నినాదమైన 'అమెరికా ఫస్ట్'ను గాలిబాఫ్ తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్ అమెరికా ప్రయోజనాల కంటే ఇజ్రాయెల్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన నినాదం 'ఇజ్రాయెల్ ఫస్ట్' గా మారిందని ఆరోపించారు. ఇజ్రాయెల్ ఇచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మి అమెరికా తన విదేశీ విధానాలను నాశనం చేసుకుంటోందని, అందుకే ఇప్పుడు మధ్యవర్తుల ద్వారా తమతో చర్చలకు విజ్ఞప్తులు పంపుతోందని సెటైర్లు వేశారు. ఇరాన్ తన రేవులపై ఉన్న ఆంక్షలను

ఎత్తేయాలని పట్టుబట్టడం, అమెరికా అందుకు ససేమిరా అనడం మధ్య హార్మ్యూజ్ జలసంధి బందీగా మారింది. యుద్ధంలో ఇరాన్ సాధించిన 'పైచేయి' చూసి అమెరికా భయపడిందని గాలిబాఫ్ చెబుతున్న మాటలు.. పశ్చిమాసియాలో ఇరాన్ ప్రాబల్యం పెరుగుతోందనడానికి సంకేతం. అయితే, ఈ మాటల యుద్ధం క్షేత్రస్థాయిలో నిజమైన యుద్ధానికి దారితీస్తే మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కావడం ఖాయం.

# లైఫ్ అంటే లైట్ కాదు బ్రో !



జీవితం అన్నది మూడు అక్షరాల పదం అనుకుంటారు కానీ అనుభవించే సరికి ముప్పయి మూడు సముద్రాలు దాటినంత ఫీల్ కలుగుతుంది. జీవితాన్ని ఎవరు ఎలా చూస్తారు అన్నది వారి వ్యక్తిగతమైనా అందరికీ జీవితం ఒక్కేలా ఉండదు అన్నది నిజమైనా కూడా కామన్ గా లైఫ్ విషయంలో కొన్ని ఉంటాయి. ఎంతటివారికైనా కష్టాలు సుఖాలు రెండూ ఉంటాయి. అదే పనిగా సుఖమే లభిస్తే అది కూడా కష్టమే. అయినా కష్టం సుఖం కూడా మనసుకు సంబంధించిన భావన అది ఎవరు ఎంత మేరకు తీసుకుంటారు అన్న దానిని బట్టే అవి వారిని ప్రభావితం చేసే తీరు ఆధారపడి ఉంటుంది.

**జవాబు చెప్పాల్సిందే :**

జీవితంలో ప్రతీ ప్రశ్నకు కచ్చితంగా జవాబు చెప్పాల్సిందే. తప్పించుకోవడానికి ఎక్కడా అవకాశం ఉండదు, మామూలు పరీక్షలో ఏదైనా ప్రశ్నకు జవాబు తెలియకపోతే దానిని దాటుకుని ముందుకు పోవచ్చు. కానీ జీవితంలో అలా కాదు సమాధానం వెతకాల్సిందే. లేకపోతే అక్కడ నుంచి కదిలేది ఉండదు, అందుకే జీవితంలో ప్రశ్నలకు జవాబు చెప్పే శక్తిని సాధించాలి, అలా కాకపోయినా జవాబు కోసం వెతికే ఓపిక ఓరిమి అయినా ఉండాలి. అన్ని ప్రశ్నలకు వేగంగా జవాబులు దొరకవు, కొన్నింటికి అసలు జవాబులు ఉంటాయో లేదో కూడా తెలియదు. అయినా సహనంతో వెతకాల్సిందే వేచి చూడాల్సిందే. ఎందుకంటే తప్పించుకునేందుకు దారి లేదు కాబట్టి.

**టఫ్ కూడా కాదు :**

జీవితం అంటే లైట్ కాదు అంటున్నారు కదా టఫ్ గా ఉంటుందా అంటే టఫ్ కూడా కాదు. అయితే ఒక్కోసారి అది అలా అనిపిస్తుంది. లైఫ్ ని డీల్ చేసే విధానం బట్టే ఇదంతా ఆధారపడి ఉంటుందని చెప్పాలి. ఎవరు ఎలా జీవితాన్ని నడిపిస్తారో తమ మానసిక స్తోమతను ఏ మేరకు ఖర్చు చేస్తారో దానిని బట్టే జీవితం లోతు ఏమిటి అన్నది బోధపడుతుంది. ఎవరెంత సాధించినా శోధించినా కూడా జీవితం అందరికీ ఆటాడిస్తుంది, అందరికీ వెంటపెట్టి వేధిస్తుంది, అంత మాత్రం చేత జీవితానికి భయపడడం అన్నది ఏ మాత్రం మంచిది కాదు, అసలు అది కుదిరేది కూడా కాదు.

**పులి మీద స్వారీ :**

అవును ఈ విధంగా కూడా జీవితాన్ని పోల్చవచ్చు. అచ్చం పులి మీద స్వారి చేయడం లాంటిదే జీవితం. పులి మీద కూర్చున్న వాడు భయంతో అయినా స్వారీ చేయాల్సిందే. ఎక్కడా ఆగిపోకూడదు, దిగిపోయేందుకు దారి లేదు, ఒకవేళ తెగించి దిగాలనుకున్నా అదే పులి చంపేస్తుంది. అందువల్ల జీవితం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. దానిని తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలని పిచ్చి ఆలోచనలు మానేసి దానిని ఏ విధంగా డీల్ చేస్తే బాగా ఉంటామో ఆ గుట్టు ఎరిగి మరీ ముందుకు సాగాల్సి ఉంటుంది. లేకపోతే అదే జీవితం తినేస్తుంది కూడా.

**ఓర్పుతోనే మార్పు :**

ఎంత ఓర్చితే అంత మేలు అన్నది ఒక ముతక సామెత ఉంది. అది జీవితానికి అన్వయించుకోవాలి. సహనంగా ఉండాలి. సవాళ్ళు వచ్చినపుడు బెదిరి బావురుమనకూడదు, అదిరిపడిపోయి అవతలకు పారిపోయే ప్రయత్నం అంతకంటే చేయకూడదు. వాస్తవంలో ఉండాలి. జీవితం అంటేనే ఇలాగే ఉంటుంది అనుకోవాలి. సమస్యలను స్వాగతించాలి. వాటిని ఓరిమితో కూరిమితో చేరదీసి పరిష్కారం కోసం చూడాలి. అంతే కాదు మంచి కాలం కోసం వేచి చూడాలి. ఒక్కటి అయితే అంతా గుర్తు పెట్టుకోవాలి. జీవితం ముందు ఎవరూ తోపులు కాదు, ఎంతవారైనా ఎన్నో సార్లు వైకుంఠపాళిలో పాము మింగేసి పాతాళానికి వెళ్ళి మరీ నిచ్చెన మెట్లు వెతుక్కుని ఎక్కిన వారే అని గ్రహించాలి.

**జీవితం తెల్ల కాగితం :**

అంతా ఒక్కటే అందరూ జీవితంతో పోరాడుతున్నారని ఆలోచించినపుడు స్పోర్టివ్ గా లైఫ్ ని తీసుకోవడం అలవాటు అవుతుంది. అపుడు జీవితం అనే ఆటలో పాములు ఉన్నా నిచ్చెనలు ఉన్నా రెండింటినీ సమానంగా చూసి తీసుకునే విచక్షణ వస్తుంది. జీవితం అన్నది ఒక తెల్ల కాగితం అయితే దాని మీద అన్నీ ఆణి ముత్యాల లాంటి రాతలే ఉంటాయని ఉండాలనుకోవడం కూడా తప్పుడు ఆలోచన. కొక్కిరి రాతలు కూడా ఉంటాయి. అలాగని కాగితాన్ని చింపేసినంత సులువుగా జీవితాన్ని నలిపేయలేమని గుర్తుంచుకుంటే జీవితం విలువ తెలుస్తుంది, దానిని ఆస్వాదించే తీరులోనూ మార్పు కనిపిస్తుంది.

# ఉప్పల్ స్టేడియంలో క్షుద్రపూజ దెబ్బ: చెన్నై ఇందుకే ఓడింది..



క్రికెట్ అంటే ఇన్నాళ్లూ కేవలం బ్యాటు, బంతి, ఫిట్‌నెస్ అనుకున్న వాళ్లందరూ ఇప్పుడు నోరెళ్లబెట్టాల్సిన సమయం వచ్చింది. ఎందుకంటే శనివారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన సన్ రైజర్స్ వర్సెస్ సీఎస్కే మ్యాచ్‌తో క్రికెట్ స్వరూపమే మారిపోయింది. ఇకపై కోచ్‌లు నెట్స్ ప్రాక్టీస్ బదులు.. నెమలి పింఛాలు, నిమ్మకాయలు, విభూతి పళ్లేలతో మైదానానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అసలేం జరిగింది? నిమ్మకాయతో మంత్రం.. శివమ్ దూబే ఔట్!**

సాధారణంగా స్టేడియంలో ఫ్యాన్స్ "సీఎస్కే.. సీఎస్కే.." లేదా "ఎస్ఆర్.హెచ్.. ఎస్ఆర్.హెచ్" అని అరుస్తారు. కానీ ఒక వ్యక్తి మాత్రం చేతిలో నిమ్మకాయ పట్టుకుని, కళ్లు మూసుకుని గాలిలోకి ఏదో మంత్రాలు వదులుతూ కనిపించాడు(అతను ఫన్ కోసమే చేసాడు అని క్లియర్ గా అర్థం అవ్వుతుంది ). కట్ చేస్తే.. క్రీజులో బాదుతున్న శివం దూబే క్లీన్ బౌల్డ్! సరిగ్గా ఆ నిమ్మకాయ స్వామి గాలిలోకి "ఋష్!" అని ఊదిన క్షణానికే వికెట్ ఎగిరిపోవడంతో ఇది యాదృచ్ఛికమా లేక యంత్ర-తంత్ర మాయాజాలమా అని ఫాన్స్ తలలు పట్టుకుంటున్నారు.

**క్రికెట్ ప్రపంచంలో ఫన్నీ థింగ్**

ఈ ఘటన తర్వాత సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. నెటిజన్లు బీసీసీఐ (బీసీసీఐ) ముందు కొన్ని వింత డిమాండ్లు ఉంచుతున్నారు. యాంటీ-బ్లాక్ మ్యాజిక్ స్క్వాడ్ ను స్టేడియంలో పెట్టాలంటున్నారు. స్టేడియంలోకి వచ్చేటప్పుడు ఫ్యాన్స్‌ను కేవలం టికెట్లే కాదు.. జేబులో నిమ్మకాయలు, మిరపకాయలు ఉన్నాయేమో కూడా తనిఖీ చేయాలి. ఒకవేళ బ్యాటర్ అవుట్ అయితే అది బంతి వల్ల అయ్యాడా లేక స్టాండ్స్‌లో కూర్చున్న ఎవరో మంత్రగాడి "ఋష్" వల్ల అయ్యాడా అని థర్డ్ అంపైర్ రివ్యూ చేయాలి. ఒకవేళ అది మంత్రం అని తేలితే దాన్ని 'డెడ్ బాల్'గా ప్రకటించాలి. నేషనల్ క్రికెట్ అకాడమీ లో ఇకపై బౌలింగ్ యాక్షన్‌తో పాటు, వికెట్లు పడగొట్టే 'అఘోర స్టైల్ మంత్రాలను' కూడా కోర్సులో చేర్చాలని డిమాండ్ వినిపిస్తోంది.

**ఎడిటింగ్ మాయా? ఎమోషన్ మాయా?**

అయితే కొందరు లాజిక్ వెతికే మేధావులు "ఇదంతా వీడియో ఎడిటింగ్ మ్యాజిక్, వికెట్ పడిన విజువల్‌కు అతని వీడియోను సింక్ చేశారు" అని వాదిస్తున్నారు. కానీ సోషల్ మీడియా యుగంలో 'నిజం' కంటే 'నిమ్మకాయ' కే వాల్యూ ఎక్కువ! "నిజమే చెబితే అది వార్త అవుతుంది.. అదే మంత్రాన్ని జోడిస్తే అది వైరల్ అవుతుంది" అన్న సూత్రాన్ని ఈ వీడియో మరోసారి ప్రూవ్ చేసింది. బ్యాట్స్‌మెన్ ఎంత ప్రాక్టీస్ చేసినా బౌలర్లు ఎంత వేగంగా బంతులు వేసినా.. గ్యాలరీలో కూర్చున్న ఒక నిమ్మకాయ స్వామి "ఋష్" అంటే వికెట్ ఎగిరిపోతుందని నమ్మే స్థితికి మనం వచ్చేశాం. ఇది కేవలం సరదాకి చేసారని తెలుస్తుంది నవ్వుకోసం అంతే ..చాల ఫాస్ట్ గా ఈ వీడియో వైరల్ అవ్వుతుంది .

# టైటానిక్ విషాదానికి సాక్ష్యం.. వేలంలో రికార్డు సృష్టించిన లైఫ్ జాకెట్

## లండన్‌లో రూ. 9 కోట్లకు అమ్ముడైన చారిత్రక వస్తువు

## లారా మాబెల్ అనే ప్రయాణికురాలిని కాపాడిన జాకెట్

## జాకెట్ పై ప్రమాదం నుంచి బయటపడిన 9 మంది సంతకాలు





సముద్రంలో మునిగిపోయిన టైటానిక్ నౌకకు సంబంధించిన వస్తువులకు ప్రపంచవ్యాప్తంగా ఎంతటి క్రేజ్ ఉందో మరోసారి నిరూపితమైంది. ఆ మహా విషాదం నుంచి ఓ ప్రయాణికురాలి ప్రాణాలను కాపాడిన లైఫ్ జాకెట్ తాజాగా లండన్ లో జరిగిన వేలంలో రికార్డు ధరకు అమ్ముడుపోయింది. ఫీజులతో కలిపి ఏకంగా రూ.9 కోట్లకు ఓ అజ్ఞాత వ్యక్తి దీనిని సొంతం చేసుకున్నారు. ఇంగ్లాండ్‌లోని హెన్రీ ఆల్డ్రిడ్జ్ అండ్ సన్ సంస్థ నిర్వహించిన వేలంలో ఈ చారిత్రక లైఫ్ జాకెట్‌కు 6,70,000 పౌండ్ల (సుమారు రూ.7.50 కోట్లు) ధర పలికింది. ఫీజులు, ఇతర ఛార్జీలతో కలిపి దీని ధర రూ.9 కోట్లకు చేరింది. ఫోన్ ద్వారా వేలంలో పాల్గొన్న ఓ వ్యక్తి దీన్ని కొనుగోలు చేశారు. ఈ లైఫ్ జాకెట్ టైటానిక్‌లో ఫస్ట్

క్లాస్ ప్రయాణికురాలైన లారా మాబెల్ ఫ్రాంకటెల్లికి చెందినది. ఆమె అప్పటి ఫ్యాషన్ డిజైనర్ లూసీ డఫ్ గోర్డాన్ వద్ద సెక్రటరీగా పనిచేసేవారు. 1912లో ప్రమాదం జరిగినప్పుడు, ఆమె తన యజమానులతో కలిసి 'లైఫ్ బోట్ నంబర్ 1'లో సురక్షితంగా బయటపడ్డారు. క్యాన్వాస్ వస్త్రం, కార్క్ ముక్కలతో తయారైన ఈ జాకెట్ ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం. దీని చారిత్రక విలువను పెంచే మరో ముఖ్య అంశం ఏమిటంటే, దీనిపై లారాతో పాటు ప్రమాదం నుంచి బయటపడిన మరో ఎనిమిది మంది సంతకాలు కూడా ఉన్నాయి. ఇది కేవలం ఒక వస్తువుగా కాకుండా, ఆనాటి భయానక ఘటనకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. నిజానికి వేలంలో ఈ జాకెట్ 2.5 లక్షల నుంచి 3.5 లక్షల పౌండ్లు పలుకుతుందని నిర్వాహకులు అంచనా వేశారు. కానీ ఊహించని రీతిలో రెట్టింపు ధరకు అమ్ముడుపోయింది. ఇదే వేలంలో టైటానిక్ లైఫ్ బోట్‌కు చెందిన ఓ సీటు కుషన్ కూడా రూ.4.5 కోట్లకు పైగా ధర పలకడం విశేషం.

# ప్రైవేటు ట్రావెల్స్ కి చెక్.. వరుస ప్రమాదాలతో కీలక నిర్ణయం

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు టావెల్స్ కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షాక్ ఇచ్చాయి. ఇప్పటి వరకు ఒక దేశం, ఒకే విధానం పేరిట పర్మిట్లు జారీ చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై ప్రైవేటు ట్రావెల్స్ ఎక్కడ తిరుగుతాయో అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సివుంటుందని తేల్చిచెప్పింది. ఇటీవల వరుసగా ప్రమాదాలకు గురవుతూ ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ట్రావెల్స్ కి బ్రేకులు వేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖకు స్పందించిన కేంద్రం బస్సు పర్మిట్ల జారీ విధానాన్ని మార్చింది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక దేశం - ఒకే విధానం అమలులోకి తెచ్చింది. అంతవరకు బస్సు ఏ రాష్ట్రంలో తిరిగితే అక్కడే రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సివుండేది. ఈ కారణంగా దేశంలో రకరకాల పన్ను విధానాలు అమలు అవుతున్నాయని కేంద్రం భావించి ఒకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఆలిండియా పర్మిట్ జారీ చేసి బస్సు ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసినా దేశం మొత్తం తిరగవచ్చు అన్న వెసులుబాటు కల్పించింది. ఆలిండియా పర్మిట్ కు రూ.2 లక్షలు వసూలు కేంద్రం వసూలు చేసి అందులో సగం రాష్ట్రాలకు పంచుతామని చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అంగీకరించాయి. అయితే కేంద్ర విధానం బస్సు ఆపరేటర్లకు వరంగా మారింది. దేశంలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్న వెసులుబాటుతో నిబంధనలు కఠినంగా ఉండే తెలుగు రాష్ట్రాలను కాదని కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లకు మొగ్గుచూపాయి. అదేసమయంలో ఆలిండియా పర్మిట్లకు డబ్బు చెల్లించి తెలుగు రాష్ట్రాల్లో సర్వీసులు నిర్వహించేవి. తెలుగు రాష్ట్రాల్లో త్రైమాసిక ఫీజు రూ.90 వేలు ఉంటే, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ ఫీజు ఏడాదికి రూ.50 వేలే ఉండటం వల్ల బస్సు ఆపరేటర్లు ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించి రాష్ట్రంలో సర్వీసులు నడిపేవారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వస్తున్నా, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విధానంతో అంగీకరించాల్సివచ్చింది. ఈ పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో నమోదైన బస్సులు ఫిట్ నెస్ సర్టిఫికెట్లను ఆయా రాష్ట్రాల నుంచి తెచ్చుకోవాల్సివుండటం, ఈ విషయంలో ఆ




రాష్ట్రాలు సీరియస్ గా లేకపోవడంతో ఆపరేటర్లు భద్రతను గాలికొదిలేసి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. బస్సు సీటింగ్ సరిగా లేకపోవడం, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, అత్యవసర డోర్లు సరిగా నిర్వహించకపోవడంతో ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది.

ప్రధానంగా నాగాలాండ్, అరుణాచలప్రదేశ్, లక్షదీప్, దయ్యూడామన్ వంటి కేంద్ర పాలిత ప్రాంతాల్లో నమోదైన ట్రావెల్స్ బస్సులు ఎక్కువగా ఏపీ-తెలంగాణ మధ్య సర్వీసులు నిర్వహిస్తున్నాయి. ఈ బస్సులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల కర్నూలు, మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదాలకు గురయ్యాయి. దీంతో ప్రమాదాలపై లోతుగా విచారణ జరిపిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఇదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు అన్నింటి నుంచి ఇదే విధమైన లేఖలు ప్రభుత్వానికి వెళ్లడంతో ఒకే దేశం - ఒకే విధానం అన్న నిబంధనను పూర్తిగా తొలగించింది.

పాతవిధానంలోనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల కారణంగా ఇకపై ప్రైవేటు ట్రావెల్స్ పక్కాగా తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సివుండటమే కాకుండా, ఫిట్ నెస్ సర్టిఫికెట్లను కూడా ఇక్కడే పొందాల్సివుంటుంది. దీనివల్ల పక్కాగా నిబంధనలు అమలు చేసి బస్సు ప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవడానికి వీలు అవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

# పాకిస్తాన్ తో దోస్తీ.. అమెరికాకు టెన్షన్ పట్టుకుందా?

అమెరికా విదేశాంగ విధానంలో పాకిస్తాన్ ఎప్పుడూ ఒక చిక్కుముడిగానే ఉంటూ వస్తోంది. అయితే ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ మధ్య చిగురిస్తున్న సంబంధాలు దౌత్య పరిమితులను దాటి భద్రతా కోణంలో సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. మునీర్‌ను ట్రంప్ "ప్రియమైన ఫీల్డ్ మార్షల్" అని సంబోధించడం ఒక ఎత్తు అయితే అదే మునీర్ పట్ల అమెరికా గూఢచారి సంస్థలు తీవ్రమైన అనుమానాలు వ్యక్తం చేయడం మరో ఎత్తు. ఈ వైరుధ్యం అమెరికా అంతర్గత విభేదాలను బాహ్య ప్రపంచానికి స్పష్టం చేస్తోంది.

**ఇరాన్ కనెక్షన్.. మునీర్ ఒక 'రెడ్ అలర్ట్'?**

ఈ వివాదానికి ప్రధాన కేంద్ర బిందువు ఇరాన్‌తో మునీర్‌కు ఉన్నట్లుగా చెబుతున్న రహస్య సంబంధాలు. పాకిస్తాన్ మాజీ జనరల్ అహ్మద్ సయీద్ వెల్లడించిన సమాచారం ప్రకారం, ఆసిమ్ మునీర్‌కు ఇరాన్ యొక్క పవర్‌ఫుల్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) లోని అగ్రనేతలతో దశాబ్దాల కాలంగా పరిచయాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా దాడుల్లో మరణించిన ఖాసీం సులేమానీ, ప్రస్తుత చీఫ్ హుస్సేన్ సలామీ వంటి వారితో మునీర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు గరిష్ట స్థాయిలో ఉన్న తరుణంలో మునీర్ మధ్యవర్తిత్వం వహించాలని ప్రయత్నించడం అమెరికా నిఘా వర్గాలకు మింగుడు పడటం లేదు. శత్రువులతో చెలిమి చేసే వ్యక్తికి వ్యూహాత్మక సమాచారం అందడం వల్ల 'సెక్యూరిటీ బ్రీచ్' జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**చరిత్ర పునరావృతమవుతోందా?**

గతంలో ఆఫ్ఘనిస్తాన్ యుద్ధ సమయంలో కూడా అమెరికా పాకిస్తాన్‌ను గుడ్డిగా నమ్మి భారీ మూల్యం చెల్లించుకుంది. ఒకవైపు అమెరికా నుండి భారీగా నిధులు పొందుతూనే మరోవైపు తాలిబాన్ నెట్‌వర్క్‌లకు పాక్ ఆశ్రయం కల్పించిందన్న ఆరోపణలు జగమెరిగిన



సత్యం. ప్రజాస్వామ్య రక్షణ సంస్థ కు చెందిన విశ్లేషకుడు బిల్ రోగియో అభిప్రాయం ప్రకారం "పాకిస్తాన్ ఎప్పుడూ తన సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుంది తప్ప అమెరికా ప్రయోజనాలకు కాదు" అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మునీర్ పై అతిగా ఆధారపడటం ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు.

**శాంతి దూతనా లేక వ్యూహాత్మక ముప్పా?**

ప్రస్తుత పరిస్థితుల్లో మునీర్ పాత్ర రెండు అంచుల కత్తిలా మారింది. ఒకవేళ మునీర్ తన పాత పరిచయాలను ఉపయోగించి ఇరాన్, అమెరికా మధ్య శాంతిని నెలకొల్పగలిగితే అది మధ్యప్రాచ్యంలో ఒక పెద్ద విజయం కావచ్చు. అదే సమయంలో అమెరికా యొక్క కీలక వ్యూహాలను ఇరాన్ లేదా ఇతర శత్రు దేశాలకు లీక్ చేసే అవకాశం ఉందనే భయం నిఘా వర్గాలను వేధిస్తోంది.

**ట్రంప్ ముందున్న సవాలు**

వ్యక్తిగత సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చే ట్రంప్, మునీర్‌తో కలిసి ముందుకు సాగుతారా? లేక తన దేశ నిఘా సంస్థల హెచ్చరికలను గౌరవిస్తారా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. దక్షిణాసియా, మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాల్లో పాకిస్తాన్ పోషించే పాత్ర ఎప్పుడూ ఊహాతీతమే.

మొత్తానికి ఆసిమ్ మునీర్ అమెరికాకు ఒక నమ్మకమైన 'వారధి'గా నిలుస్తారా లేక గతంలో లాగే పాకిస్తాన్ మరోసారి అమెరికాను వ్యూహాత్మక పద్మవ్యూహంలో చిక్కుకునేలా చేస్తుందా అనేది వేచి చూడాలి. అమెరికా- పాకిస్తాన్ బంధం మళ్లీ ఒక క్లిష్టమైన పరీక్షా కాలంలోకి ప్రవేశించింది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

# మరిన్ని జిల్లాల్లో సేవలను అందిస్తాం... ప్రకటించిన ఎల్యూబీ



**హైదరాబాద్ :** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్?ఎంఈ)ను బలోపేతం చేయడంలో భాగంగా తెలంగాణలోని 13 జిల్లాలకు తమ సేవలను విస్తారిస్తామని లఘు ఉద్యోగ్ భారతి (ఎల్‌యూబీ) ప్రకటించింది.

హైదరాబాద్‌లో సంస్థ అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికను మార్చేందుకు ఐటీఐలతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఐఐసీటీ వద్ద సిద్ధంగా ఉన్న 2,600లకు పైగా టెక్నాలజీలను ఎంఎస్?ఎంఈలకు అనుసంధానం చేయడం ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

# పేటీఎం గోల్డ్ సేవలు 12 వేల పిన్ కోడ్లకు..




హైదరాబాద్ : పేటీఎం గోల్డ్ తన సేవలను దేశవ్యాప్తంగా 12 వేల పిన్ కోడ్లకు విస్తరించింది. అక్షయ తృతీయ సందర్భంగా వినియోగదారులు తమ డిజిటల్ గోల్డ్ నిల్వను 24 క్యారెట్ల బంగారు నాణేలుగా మార్చుకుని నేరుగా ఇంటికే తెప్పించుకోవచ్చు. ఎంఎంటీసీ--పీఎంఎంపీ సహకారంతో అందిస్తున్న ఈ సేవల్లో కొనుగోలు చేసిన బంగారాన్ని బీమా చేసిన సురక్షిత లాకర్లలో భద్రపరుస్తారు. దీనికి అదనపు నిల్వ చార్జీలు ఉండవు. వినియోగదారులు తమ డిజిటల్ బంగారాన్ని ఎప్పుడైనా అప్పటి మార్కెట్ ధర ప్రకారం నగదు రూపంలోకి మార్చుకోవచ్చు. ఈ విస్తరణ ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలు సైతం సులభంగా బంగారాన్ని పొందే వీలు కలుగుతుందని పేటీఎం గోల్డ్? తెలిపింది.

# ఓలా అక్షయ తృతీయ ఆఫర్లు.. రూ.50 వేల వరకు ప్రయోజనాలు



న్యూఢిల్లీ: అక్షయ తృతీయ సందర్భంగా ఓలా ఎలక్ట్రిక్ "ఓలా సోనా వీకెండ్" ఆఫర్లను ప్రకటించింది. ఈ ప్రత్యేక ఆఫర్లలో కస్టమర్లకు రూ.50 వేల వరకు ప్రయోజనాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది. అదనంగా, 24 క్యారెట్ బంగారు పూతతో కూడిన లిమిటెడ్ ఎడిషన్ ఓలా సోనా స్కూటర్ గెలుచుకునే అవకాశం కూడా ఉందని తెలిపింది. రోడ్‌స్టర్ ఎక్స్ ప్లస్? 9.1 కిలోవాట్ల బ్యాటరీ మోడల్‌పై రూ.50 వేల తగ్గింపు ఇచ్చి రూ.1,39,999కే అందుబాటులోకి తెచ్చామని ఓలా ఎలక్ట్రిక్ పేర్కొంది.

ఈ ఆఫర్లు ఏప్రిల్ 18,19 తేదీల్లో అందుబాటులో ఉంటాయి. అన్ని మోడల్స్‌పై రూ.40 వేల వరకు తగ్గింపులు, 8 ఏళ్ల వారంటీ, కొన్ని బ్యాంకుల క్రెడిట్ కార్డులపై ఈఎంఐ ఆఫర్లు కూడా ఉన్నాయి. ఓలా సోనా స్కూటర్‌లో 24 క్యారెట్ బంగారు పూతతో పాటు "సోనా మూడ్" అనే ప్రత్యేక ఫీచర్ ఉందని, మూవ్‌ఓఎస్ డ్యాష్‌బోర్డ్ ద్వారా రైడ్ మోడ్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చని తెలిపింది.

# మహిళా ఆఫీసర్ కు బాదం పప్పుల గిఫ్ట్.. ఛత్తీస్ గఢ్ లో ఓ పౌరుడి వినూత్న నిరసన..



ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఆలస్యం కావడం, అధికారులు ఫైళ్లు కనిపించడం లేదని చెప్పడం సాధారణం. కానీ, ఛత్తీస్ గఢ్ లోని భిలాస్ పూర్ లో ఓ వ్యక్తి దీనిపై వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. తన ఫైల్ గురించి పదేపదే మర్చిపోతున్నానన్న ఓ మహిళా అధికారిణికి బాదం పప్పుల ప్యాకెట్ ఇచ్చి షాకిచ్చాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఛత్తీస్ గఢ్ లోని భిలాస్ పూర్ జిల్లా హౌజింగ్ బోర్డ్ కార్యాలయంలో తాను పెట్టుకున్న దరఖాస్తుకు అధికారులు ఆమోదం తెలపడంలేదంటూ ఓ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆఫీసులోని మహిళా అధికారి తనను ఏడాదిగా తిప్పించుకుంటోందని ఆరోపించాడు. ఎప్పుడు వెళ్లినా తన ఫైల్ కనిపించడంలేదని, ఎక్కడ పెట్టానో గుర్తులేదని చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దాదాపు ఏడాదిగా ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయానని చెబుతూ.. తాజాగా ఓ బాదం పప్పుల ప్యాకెట్ తీసుకొచ్చి సదరు మహిళా అధికారి టేబుల్ పై కుమ్మరించాడు. "మేడం.. ఈ బాదం పప్పులు తినండి. ఇవి మీ మెదడును షార్ప్ చేసి జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయి. అప్పుడు నా ఫైల్ ఎక్కడ పెట్టారో గుర్తుకు వస్తుంది. ఆ తర్వాతైనా నా పని చేసిపెట్టండి" అంటూ అధికారికి తన నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన మొత్తాన్నీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ వీడియో కాస్తా ఇప్పుడు వైరల్ గా మారింది. ఆ వ్యక్తి చేసిన పనిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. "ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి ఇంతకంటే మంచి ట్రీట్‌మెంట్ లేదు" అని కొందరు, "గాంధేయమార్గంలో అద్భుతమైన నిరసన" అని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు.

# ఈ ఆహారాల్లోనూ ఉప్పు ఎక్కువగా ఉంటుందట..!



అధిక రక్తపోటు ఉన్నవారు ఉప్పు తక్కువగా తినాలని వైద్యులు చెబుతుంటారు. అయితే మనకు ఆరోగ్యకరంగా అనిపించే కొన్ని ఆహారాలలో కూడా 'దాగి ఉన్న సోడియం' ఉంటుందని, ఇది దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉప్పు అధికంగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి హానికరం అనేది అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా అధిక రక్తపోటు ఉన్నవారు ఉప్పు తక్కువగా తినాలని వైద్యులు చెబుతుంటారు. అయితే మనకు ఆరోగ్యకరంగా అనిపించే కొన్ని ఆహారాలలో కూడా 'దాగి ఉన్న సోడియం' ఉంటుందని, ఇది దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉప్పు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలలో మాత్రమే సోడియం ఉంటుందనేది ఒక అపోహ. మనం రోజూ తినే కొన్ని ఆహార పదార్థాలలో ఉప్పు రుచిని స్పష్టంగా గుర్తించలేకపోయినప్పటికీ, వాటిలో గణనీయమైన మొత్తంలో సోడియం ఉంటుంది. చాలా మంది చపాతీ తేలికైన, ఆరోగ్యకరమైన ఆహారంగా భావిస్తారు. అయితే ఒక్క చపాతీలో 150 నుండి 230 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. అల్పాహారంగా ఎక్కువ మొత్తంలో చపాతీ తినడం వల్ల శరీరంలో సోడియం స్థాయిలు పెరగవచ్చు. అదేవిధంగా ప్రాసెస్ చేసిన ఆహారాలలో కూడా ఉప్పు అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలు ఆరోగ్యకరమైనవిగా పరిగణించబడినప్పటికీ వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య ప్రమాదం పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. అందువల్ల, ప్యాకెట్‌పై ఉన్న సోడియం పరిమాణాన్ని గమనించి ఆహారాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు అంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 5 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదు. కానీ మనలో చాలా మంది తెలియకుండానే ఇంతకంటే ఎక్కువ ఉప్పును తీసుకుంటున్నారు. బ్రెడ్, తృణధాన్యాలు వంటి ఆహార పదార్థాల నుంచి శరీరంలోకి అదనపు ఉప్పు చేరుతోంది. ఈ విధంగా శరీరంలో సోడియం పరిమాణం పెరిగితే, రక్తపోటు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే బీపీ సమస్యలు ఉన్నవారు అధికంగా ఉప్పు తీసుకుంటే వారి ఆరోగ్యం మరింత క్షీణించే ప్రమాదం ఉంది. ఆరోగ్యకరంగా కనిపించే ఆహార పదార్థాలలో కూడా దాగి రహస్యంగా దాగి ఉన్న సోడియం ఉంటుంది. అందువల్ల ఆహారం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండటం, లేబుల్‌ను తనిఖీ చేసే అలవాటు ఉండాలి. ఇది బీపీ, గుండె సంబంధిత సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది.

# రాత్రిళ్లు తరచూ మూత్రవిసర్జన.. లైట్ తీసుకున్నారో ఆరోగ్యం గల్లంతే!



మనలో చాలామంది కొన్ని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటాం. అయితే ఈ సమస్యలు పెరగడం వల్ల శరీరంపై నేరుగా ప్రభావం చూపుతాయి. దీని కారణంగా శరీరంలో కనిపించే లక్షణాలు నిర్లక్ష్యం చేస్తే అధిక మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుంది. అందుకే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మనలో చాలామంది కొన్ని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటాం. అయితే ఈ సమస్యలు పెరగడం వల్ల శరీరంపై నేరుగా ప్రభావం చూపుతాయి. దీని కారణంగా శరీరంలో కనిపించే లక్షణాలు నిర్లక్ష్యం చేస్తే అధిక మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుంది. అందుకే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నేటి వేగవంతమైన జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడానికి ఎవరికీ సమయం లేదు. ప్రతిఒక్కరూ పని, ఇంటి పనులతో తీరిక లేకుండా పరుగులు తీస్తున్నారు. అయినప్పటికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం చాలా అవసరం. ఏదైనా పెద్ద వ్యాధి వచ్చే ముందు మన శరీరం ఎల్లప్పుడూ కొన్ని సంకేతాలు ఇస్తుంది. కానీ మనం వాటిని పట్టించుకోం. ముఖ్యంగా తరచుగా మూత్రవిసర్జన చేయడం.. అందులోనూ ముఖ్యంగా రాత్రిపూట తరచూ మూత్ర విసర్జన చేయడం అనారోగ్యానికి కూడా ఓ సంకేతమే. ఇటువంటి సందర్భంలో మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మీ గొంతు పొడిగా అనిపించడం, అలాగే నిరంతరం దాహంగా అనిపించడం కూడా ఒక తీవ్రమైన అనారోగ్య లక్షణం. మీకు ఈ లక్షణాలలో ఏవైనా కనిపిస్తుంటే మీరు ముందుగా వైద్యుడిని సంప్రదించాలి. ఇవి మధుమేహం ప్రధాన లక్షణాలు. మీరు సకాలంలో వైద్యుడిని సంప్రదించకపోతే సమస్య మరింత తీవ్రం కావచ్చు. అందుకే ఈ లక్షణాలు నిర్లక్ష్యం చేయకపోవడమే మంచిది.

## డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో దీని తర్వాతే ఏదైనా



వేసవి కాలం వచ్చేసింది. ఎండలు తీవ్రమవుతున్న కొద్దీ మన శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో వేగంగా తగ్గిపోతుంది. కేవలం నీళ్లు తాగడం మాత్రమే కాకుండా, మనం తీసుకునే ఆహారం ద్వారా కూడా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చు. వేసవి పండ్ల గురించి మాట్లాడేటప్పుడు అందరికీ మొదటగా గుర్తొచ్చేది 'పుచ్చకాయ'. దాదాపు 91 నుండి 92 శాతం నీటిని కలిగి ఉండే పుచ్చకాయ, ఎండల బారి నుండి మనల్ని రక్షించే అద్భుతమైన ఫలమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. ఎండలో తిరిగేటప్పుడు వచ్చే అలసట, తలనొప్పి వంటి సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయలో ఉండే అత్యధిక నీటి శాతం మరియు ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడతాయి. ఎండ వేడి వల్ల కలిగే అలసట, మైకము వంటి లక్షణాలను ఇది తగ్గిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి మరియు లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎండ వల్ల దెబ్బతినే చర్మాన్ని రక్షించి, చర్మం తాజాగా ఉండేలా చేస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. ఇది కడుపుని నిండుగా ఉంచుతూనే శరీరాన్ని తేలికగా ఉంచుతుంది. పుచ్చకాయను ఉదయం పూట స్నాక్‌లా తీసుకోవడం లేదా పండ్ల ముక్కలతో కలిపి సలాడ్‌లా తీసుకోవడం మంచిది. ఎటువంటి చక్కెర కలపకుండా తాజాగా జ్యూస్ చేసుకుని తాగవచ్చు. దీనికి కొద్దిగా పుదీనా ఆకులు కలిపితే రుచితో పాటు చలువ కూడా చేస్తుంది. వేసవిలో వచ్చే ఇతర పండ్లైన కర్బూజ (90%), స్ట్రాబెర్రీ (91%), ఆరెంజ్ (87%) మరియు పైనాపిల్ (86%) లలో కూడా నీటి శాతం ఎక్కువే ఉన్నప్పటికీ, పుచ్చకాయ వీటన్నింటికంటే ముందంజలో ఉంది. అయితే, చాలామంది పండ్ల జాబితాలో దోసకాయను మర్చిపోతుంటారు. నిజానికి దోసకాయలో 95 నుండి 96 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఖనిజాలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని అద్భుతంగా కాపాడతాయి. కాబట్టి పుచ్చకాయతో పాటు దోసకాయను కూడా మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల వేసవి తాపాన్ని సులభంగా అధిగమించవచ్చు.

# తక్షణ శక్తికోసం ఏది తినాలి..?





మన నిత్య జీవితంలో పనులు చేసుకోవడానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు మన ఆహారం ద్వారా అందుతాయి. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి ఏ సమయంలో, ఎలా శక్తిని ఇస్తుందనేది చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనకు తక్షణమే ఉత్సాహం రావాల్సి ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో రోజంతా పని చేయడానికి స్థిరమైన శక్తి అవసరమవుతుంది. అటువంటి సమయాల్లో అరటిపండ్లు, ఖర్జూరాలు మనకు అద్భుతమైన ఎంపికలుగా నిలుస్తాయి. ఈ రెండూ శక్తిని అందించినప్పటికీ, వాటి పోషక విలువలలో ఉండే స్వల్ప తేడాల వల్ల వాటిని తీసుకునే సమయం వేరుగా ఉండాలి. అరటిపండ్ల విషయానికి వస్తే, వీటిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు అరటిపండులో సుమారు 100 నుండి 150 కేలరీలు ఉంటాయి. వీటిలో సహజ చక్కెరలతో పాటు పిండి పదార్థాలు ఉండటం వల్ల శరీరానికి నిరంతరాయంగా, స్థిరమైన శక్తిని అందిస్తాయి. అంతేకాకుండా అరటిపండ్లలో ఉండే పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి వంటి పోషకాలు శరీర అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా కండరాల పనితీరును మెరుగుపరచడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది వ్యాయామం చేసే సమయంలో వచ్చే కండరాల తిమ్మిర్లను తగ్గించడానికి సహాయపడుతుంది. మరోవైపు ఖర్జూరాలు తక్షణ శక్తిని అందించడంలో మేటిగా నిలుస్తాయి. కేవలం 3 నుండి 4 ఖర్జూరాలలో 90 నుండి 120 కేలరీలు లభిస్తాయి. వీటిలో సహజ చక్కెరలు పుష్కలంగా ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు లేదా ఉపవాసం ఉన్నప్పుడు తీసుకుంటే వెంటనే ఉత్సాహం వస్తుంది. ఖర్జూరాల్లో చక్కెరతో పాటు ఫైబర్, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారికి ఖర్జూరాలు ఒక అద్భుతమైన పోషకాహారంగా పనిచేస్తాయి. తీవ్రమైన శారీరక శ్రమ చేసేవారికి కూడా ఇవి తక్షణ ఇంధనంలా ఉపయోగపడతాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు పండ్ల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. అరటిపండ్లు మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల ఇవి రక్తంలోని చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచవు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు వీటిని సాధారణ పరిమాణంలో తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు, పేగు ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఖర్జూరాలకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖర్జూరాలకు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ తీసుకోవాలనుకుంటే ఒకటి లేదా రెండు మాత్రమే తీసుకోవాలి, అందులోని ఫైబర్ చక్కెర నియంత్రణకు కొంతవరకు తోడ్పడుతుంది. మన శరీర అవసరాలను బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. సులభంగా చెప్పాలంటే, మీరు వెంటనే రీఛార్జ్ అవ్వాలి అనుకుంటే ఖర్జూరాలు తీసుకోవాలి. అదే మీరు వ్యాయామం చేయాలన్నా లేదా రోజంతా చురుగ్గా ఉండాలన్నా అరటిపండ్లు తీసుకోవడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మీ దైనందిన జీవితంలో వీటిని సరైన పద్ధతిలో చేర్చుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

# ఖాళీ కడుపుతో నిమ్మరసంలో ఇది కలిపి తాగుతున్నారా..?



నేటి వేగవంతమైన జీవితంలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని చిన్న చిన్న చిట్కాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటిలో ఒకటి, పరగడుపున నిమ్మకాయ, తేనె కలిపిన నీటిని తాగడం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రారంభించడానికి చాలామంది ఉదయాన్నే నిమ్మరసం-తేనె నీటిని ఎంచుకుంటారు. ఇది ఒక పాతకాలపు పద్ధతి అయినప్పటికీ, దీని వల్ల కలిగే అద్భుత ప్రయోజనాల వల్ల నేటికీ ప్రాచుర్యం పొందుతోంది. కానీ, సరైన పద్ధతిలో పాటించకపోతే, దీని వల్ల కలిగే లాభనష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి నీటిలో నిమ్మరసం, తేనె కలపడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఒక దివ్యౌషధం లాంటిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను చంపడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను తగ్గిస్తుంది. నిమ్మరసం కాలేయాన్ని శుభ్రపరచడానికి సహాయపడుతుంది. మీ కాలేయాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి, ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగండి. ఆరోగ్య ప్రయోజనాలు: నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగుతారు. పరిమిత పరిమాణంలో తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ఖాళీ కడుపుతో తాగడం వల్ల ప్రయోజనానికి బదులుగా హాని జరగవచ్చునని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, దానిని తీసుకునే విధానంలో కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పరగడుపున నిమ్మరసం తాగడం వల్ల కడుపులో మంట వచ్చే అవకాశం ఉంది. వీరు అల్పాహారం చేసిన 40 నిమిషాల తర్వాత తీసుకోవడం మంచిది. భోజనానికి ముందు లేదా తిన్న వెంటనే దీనిని తాగకూడదు. అలా చేస్తే మనం తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించలేదు. నిమ్మరసం నీరు ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. అయితే పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తూ దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# కరివేపాకు సుగుణాల పట్టుగొమ్మే.. కానీ



కరివేపాకు లేకుంటే ఏ వంటకాన్నీ వండలేం. ఆయుర్వేదంలో దీనిని కేవలం రుచి కోసమే కాకుండా దీని ఔషధ గుణాలను పలు రోగాల చికిత్సలో ఉపయోగిస్తారు. ఇన్ని ఆరోగ్యకరమైన గుణాలు ఉన్నప్పటికీ ఈ ఆకులు అందరికీ సరిపడవని మీకు తెలుసా...? అవును కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య.. కిచెన్‌లో వండే దాదాపు ప్రతి వంటకంలోనూ కరివేపాకు ఉంటుంది. ఇది లేకుంటే ఏ వంటకాన్నీ వండలేం. ఆయుర్వేదంలో దీనిని కేవలం రుచి కోసమే కాకుండా దీని ఔషధ గుణాలను పలు రోగాల చికిత్సలో ఉపయోగిస్తారు. ఇన్ని ఆరోగ్యకరమైన గుణాలు ఉన్నప్పటికీ ఈ ఆకులు అందరికీ సరిపడవని మీకు తెలుసా?? అవును కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కరివేపాకు ఎవరికి మంచిది కాదు? వాటిని ఎందుకు తినకూడదు? కరివేపాకు సహజంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరమైనప్పటికీ ఇప్పటికే రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా ఉన్నవారిలో అధిక మొత్తంలో కరివేపాకును తీసుకోవడం వల్ల హైపోగ్లైసీమియా ప్రమాదం పెరగవచ్చు. దీనివల్ల తల తిరగడం,నీరసం కలగవచ్చు. కొన్ని రకాల మూలికలు లేదా మసాలాలు తీసుకున్నప్పుడు కొందరికి అలెర్జీలు వస్తాయి. అదేవిధంగా కరివేపాకు వల్ల కొందరికి ఎలాంటి సమస్యలు రావు. దీనిని తీసుకున్న తర్వాత, మీకు చర్మంపై దురద, వాపు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలగవచ్చు. అటువంటి సందర్భంలో దాని వాడకాన్ని ఆపివేయడం మంచిది. గర్భధారణ సమయంలో శరీరం హార్మోన్ల మార్పులకు మరింత సున్నితంగా ఉంటుంది. కరివేపాకు రసం లేదా అధిక మొత్తంలో కరివేపాకు పొడిని తీసుకోవడం వల్ల కొంతమందిలో వాంతులు లేదా జీర్ణ సమస్యలు రావచ్చు. అందువల్ల దీనిని మితంగా తీసుకోవడం ఉత్తమం. కరివేపాకు సాధారణంగా జీర్ణక్రియకు సహాయపడినప్పటికీ అల్సర్లు లేదా జీర్ణాశయ సమస్యలు ఉన్నవారు పచ్చి ఆకులను నేరుగా నమిలి తింటే కడుపు సమస్యలను ఎదుర్కోవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం మూత్రపిండాల వ్యాధి ఉన్నవారు లేదా డయాలసిస్ చేయించుకుంటున్నవారు ఏదైనా ఔషధ మొక్కను అధిక మోతాదులో తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. కరివేపాకులోని కొన్ని భాగాలు చికిత్సను ప్రభావితం చేయవచ్చు.

## రాజస్థాన్‌పై రింకు సింగ్, అనుకూల్ కిరాక్ బ్యాటింగ్..
# ఐపీఎల్‌లో కేకేఆర్‌కు తొలి విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (ఖఖ=) ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఓటమి కోరల్లో ఉన్న జట్టును రింకూ సింగ్ తన ఫినిషింగ్ టచ్‌తో గట్టెక్కించి, స్టేడియాన్ని హోరెత్తించాడు. 156 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే రాజస్థాన్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, అజింక్య రహానే ఇద్దరూ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరడంతో కేకేఆర్ 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రాజస్థాన్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన స్పిన్ మాయాజాలంతో రోవ్‌మన్ పావెల్ (23), అంగక్రిష్ రఘువంశీలను అవుట్ చేసి కేకేఆర్ ఆశలపై నీళ్లు చల్లాడు. కామెరాన్ గ్రీన్ (27) కాసేపు పోరాడినా రవి బిష్ణోయ్ అతడిని అడ్డుకున్నాడు.

**రింకూ సింగ్ 'మెరుపు' ఇన్నింగ్స్:**

ఒకానొక దశలో కేకేఆర్ ఓటమి ఖాయమనిపించింది. కానీ, క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్, అనుకూల్ రాయ్ బాధ్యతాయుతంగా ఆడారు. మొదట సింగిల్స్‌తో స్కోర్ బోర్డును నడిపించిన ఈ జోడీ, చివరి ఓవర్లలో ఒక్కసారిగా గేర్ మార్చింది. చివరి ఓవర్లో కేకేఆర్ విజయానికి 11 పరుగులు అవసరమవగా.. రింకూ సింగ్ తన విశ్వరూపం చూపించాడు. వరుసగా రెండు ఫోర్లు, ఒక కళ్లు చెదిరే సిక్సర్ బాది మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. ఈ క్రమంలోనే రింకూ సింగ్ తన కెరీర్‌లో మరో అద్భుతమైన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

**రాజస్థాన్ బౌలింగ్:**

రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా 2 వికెట్లతో ఆకట్టుకోగా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, రవి బిష్ణోయ్, యశ్ రాజ్ పుంజా తలో వికెట్ పడగొట్టారు. అయితే

చివరి నిమిషంలో రింకూ సింగ్‌ను అడ్డుకోవడంలో రాజస్థాన్ బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారు. మొదట్లో అద్భుతమైన బౌలింగ్ తో కేకేఆర్ అడ్డుకున్నప్పటికీ, చివర్లో మాత్రం ఫెయిల్ కావడంతో.. ఐపీఎల్ లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మొదటి విజయాన్ని నమోదు చేసుకుంది.

# టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న లక్నో.. పంజాబ్ ఫస్ట్ బ్యాటింగ్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా ముల్లాన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరుగుతున్న పోరులో టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో పంజాబ్ జట్టు మొదట బ్యాటింగ్ చేసేందుకు క్రీజులోకి రానుంది. ఈ మ్యాచులో భారీ టార్గెట్ పెట్టి లక్నోపై ఒత్తిడి పెట్టాలని లక్ష్యంతో పంజాబ్ బరిలోకి దిగుతుంది. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ.. మేము ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం.. ఇక్కడ ప్రత్యర్థి జట్టు నిర్దేశించే లక్ష్యాన్ని ఛేదించడం మాకు ఇష్టం.. పంజాబ్ ఈ టోర్నీలో అత్యుత్తమ జట్లలో ఒకటిగా ఉంది, కానీ ఇది మాకు స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని ఇస్తుంది.. జట్టులో ఒక మార్పు చేశాం.. దిగ్వేశ్ రాఠీ స్థానంలో సిద్ధార్థ్ జట్టులోకి వచ్చాడని పంత్ వెల్లడించారు. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మేము ముందుగా బ్యాటింగ్ చేయలేదు, కాబట్టి ఇది మాకు ఒక మంచి సవాలు.. జట్టు మెరుగుపడుతున్నప్పుడు అది 'మాలో మాకే' పోటీ అని నేను భావిస్తాను.. అజేయంగా కొనసాగాలనే పట్టుదలతో ఉన్నాం.. మేము పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్నామని అయ్యర్ పేర్కొన్నారు. లక్నో సూపర్ జెయింట్స్: మిచెల్ మార్ష్, ఆయుష్ బదోని, రిషబ్ పంత్ (కెప్టెన్/ వికెట్ కీపర్), ఐడెన్ మార్క్రమ్, నికోలస్ పూరన్, ముకుల్ చౌదరి, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, మణిమారన్ సిద్ధార్థ్, మొహ్సిన్ ఖాన్

పంజాబ్ కింగ్స్: ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కూపర్ కొన్నోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, నెహాల్ వధేరా, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్

# సూర్యకుమార్ యాదవ్‌పై వేటు.. టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్!





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పై వేటు పడే అవకాశంఉందా? అంటే అవుననే సమాధానం చెబుతున్నాయి బీసీసీఐ అధికారిక వర్గాలు. సారథిగా టీమిండియాకు అద్భుత విజయాలు అందించిన సూర్య.. బ్యాటర్ గా మాత్రం పేలవ ప్రదర్శనతో రోజు రోజుకు దిగజారిపోయాడు. దాదాపు ఏడాది పాటు టీ20ల్లో నంబర్--1 బ్యాటర్ కొనసాగిన స్కై.. ఇప్పుడు రెండెంకెల స్కోర్ చేయడానికి కూడా బాగా కష్టపడుతున్నాడు. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన తర్వాత బ్యాటర్ గా ఘోరంగా విఫలమయ్యాడు. గతేడాది దాదాపు 25కు పైగా టీ20లు ఆడిన సూర్యకుమార్ కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. కెప్టెన్సీ భారం అతడి బ్యాటింగ్ పై పడుతున్నట్లు క్రికెట్ పండితులు పేర్కొన్నారు. ఈ క్రమంలో సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పించాలని బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028తో పాటు తదుపరి రెండు టీ20 ప్రపంచకప్ లని దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ జట్టును రెడీ చేయాలని యోచిస్తున్నట్లు టాక్. దీంతో సూర్య స్థానంలో మరో ముంబై ప్లేయర్ శ్రేయస్ అయ్యరుకి జట్టు పగ్గాలు అప్పగించేందుకు ఇండియన్ క్రికెట్ బోర్డు ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. టీ20ల్లో నంబర్-- 4 స్థానానికి అయ్యర్ సరైన ప్రత్యామ్నాయమని బీసీసీఐ భావిస్తుంది. శ్రేయస్ అయ్యర్ ఇప్పటి వరకు జాతీయ జట్టుకు కెప్టెన్సీ వహించనప్పటికీ.. దేశవాళీ క్రికెట్ తో పాటు ఐపీఎల్లో కెప్టెన్ గా అతడికి మంచి ట్రాక్ రికార్డు ఉంది. శ్రేయస్ ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అంతకుముందు ఐపీఎల్-2024 సీజన్ లో కేకేఆర్ కి ట్రోఫీ అందించాడు. గత సీజన్లో పంజాబ్ జట్టుని సైతం ఫైనల్ చేర్చాడు. ఈ ఏడాది కూడా అతడి సారథ్యంలోని కింగ్స్ టీమ్ అద్భుత విజయాలతో దూసుకుపోతుంది. ఇక శ్రేయస్ డొమెస్టిక్ క్రికెట్ లో కూడా ముంబై జట్టుకు ఎన్నో విజయాలను అందించాడు. దీంతో అతడికి జాతీయ జట్టును నడిపించే సత్తా కూడా ఉందని క్రికెట్ పండితులు చెబుతున్నారు. ఇందులో భాగంగా టీ20 జట్టు పగ్గాలు శ్రేయస్ అయ్యర్ కి ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం జరుగుతుంది.



అక్షర గౌడ అద్భుతమైన ఫ్యాషన్ మూమెంట్

# ఇండియా డైరీస్ లో గ్లోబల్ బ్యూటీ స్మృతులు

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా విదేశాల్లో స్థిరపడినా? మూలాలను, భారతీయ సంస్కృతిని ఎప్పటికీ మర్చిపోరని మరోసారి నిరూపించారు. తాజాగా పీసీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న -ఇండియా డైరీస్- ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. భారతదేశ పర్యటనలో భాగంగా అమ్మడు గడిపిన సాధారణ - ఆహ్లాదకరమైన క్షణాలను ఈ ఫోటోలు ప్రతిబింబిస్తున్నాయి. విలాసవంతమైన హోటళ్లకు భిన్నంగా, అచ్చమైన దేశీ స్టైల్‌లో పీసీ విలువైన సమయాన్ని గడపడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పర్యటనలో ప్రియాంక స్థానిక దాబాలో భోజనం చేస్తూ కనిపించడం విశేషం.దాల్ మఖానీ, అమృత్‌సరి కుల్చా వంటి వంటకాలను ఎంతో ఇష్టంగా ఆస్వాదిస్తోన్న ఫోటోలు భారతీయ ఆహారంపై ఆమెకున్న మక్కువను చాటుతున్నాయి. విదేశీ వంటకాల కంటే దేశీ మసాలాలు, ఘుమఘుమలాడే పంజాబీ వంటకాలే తనకు నిజమైన తృప్తినిస్తాయని పోస్ట్ లో పేర్కొన్నారు. అంతే కాదు అక్కడ వినిపించే స్థానిక సంగీతం కూడా తన పర్యటనకు మరింత ఉత్సాహన్ని నింపిందని వెల్లడించారు. అలాగే ప్రియాంక విశ్రాంతి సమయంలో పాత బాలీవుడ్ చిత్రాలను వీక్షించారు. ముఖ్యంగా అతిలోక సుందరి శ్రీదేవి, సల్మాన్ ఖాన్ నటించిన ఐకానిక్ సినిమాలను చూస్తూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తన ఎదుగుదలలో ఆ సినిమాల ప్రభావం ఎంతగా ఉందో? పీసీ పరోక్షంగా గుర్తు చేసుకున్నారు. గ్లోబల్ నటిగా ఎదిగినా? తన మూలాలైన బాలీవుడ్ చిత్రాల పట్ల ఆమెకున్న గౌరవం ఫోటోల ద్వారా అర్థమవుతుంది.ముంబై వీధుల్లో లభించే భేల్ పూరీ గురించి ప్రియాంక ప్రత్యేకంగా ప్రస్తావించారు. న్యూస్‌పేపర్ కోన్‌లో లభించే ఆ అచ్చమైన ముంబై స్ట్రీట్ ఫుడ్ రుచిని తాను ఎంతగా మిస్ అవుతున్నారో? వివరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా ముచ్చటించడం, ఇంట్లో వండిన సాధారణ భోజనాన్ని ఆస్వాదించడం వంటివి ఆమెకు ఎంతో మానసిక ప్రశాంతతను ఇస్తాయని చెప్పుకొచ్చింది.గ్లోబల్ ఐకాన్‌గా ఎంతో బిజీగా ఉండే పీసీ ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే అసలైన ఆనందం ఉందని చాటి చెప్పారు. ప్రియాంక చోప్రా షేర్ చేసిన -ఫోటో డంప్- కేవలం పర్యటన విశేషాలే కాదు. ఆమెలోని భారతీయురాలిని మరోసారి ఆవిష్కరించాయి. ఎంత ఎత్తుకు ఎదిగినా? ఒదిగి ఉండటం , దేశ సంస్కృతిని, ఆహారాన్ని గౌరవించడం ఆమె గొప్పతనానికి నిదర్శనం. సినిమాల విషయానికి వస్తే -వారణాసి- సినిమాతో అమ్మడు టాలీవుడ్ లోనూ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ ని వీడిన తర్వాత అమ్మడు హాలీవుడ్ సినిమాలతోనే బిజీ అయిన సంగతి తెలిసిందే. అలాంటి నటిని దర్శకధీరుడు రాజమౌళి మళ్లీ భారత్ కు తీసుకురావడం విశేషం.




వాణి కపూర్ చిక్ స్టూడియో షూటౌట్‌కు తీరప్రాంత మనోజ్ఞతను తెస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965